

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పద్మశ్రీ అందుకుంటూ..

పద్మశ్రీ అందుకున్న భీమవ్వ

● రాష్ట్రపతి చేతుల మీదుగా ఢిల్లీలో ప్రదానం

బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): గత ఏడాది ఆగస్టు 15న కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన ఐదుగురికి పద్మశ్రీ అవార్డులు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కొప్పళ జిల్లాకు చెందిన 96 ఏళ్ళ తోలుబొమ్మల కళాకారిణి భీమవ్వ దొడ్డబాళప్ప శిళ్లెక్యాతర జానపద కళారంగానికి అందించిన నేపథ్యంలో భీమవ్వకు పద్మశ్రీ అవార్డు దక్కింది. సోమవారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా ఆమె అవార్డు అందుకుంది. అంతకు మునుపు ప్రధానమంత్రి మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా భీమవ్వకు హృదయ పూర్వక అభినందనలు తెలిపారు. భీమవ్వ తన 14వ ఏట నుంచి ఇప్పటి వరకు తోలుబొమ్మలాటనే కులవృత్తిగా చేసుకుని జీవనం కొనసాగిస్తోంది. కొప్పళ తాలూకా మోరనాళ గ్రామంలో 1929లో జన్మించిన భీమవ్వ నిరక్షరాస్యులైనా వంశపార్యంపరంగా వచ్చిన తోలుబొమ్మలాట కళను కాపాడుకుంటూ వస్తుండడం విశేషం.



భీమవ్వకు అభినందనలు తెలుపుతున్న ప్రధానమంత్రి మోదీ, అమిత్ షా

ఉగ్రదాడిపై ప్రధాని మోదీకే మద్దతు..!



● ఏ నిర్ణయం తీసుకున్నా సహకరిస్తాం

● కాంగ్రెస్‌లో ఖర్గే వ్యాఖ్యలే ఫైనల్.. ఇతరుల ప్రస్తావన అవసరం లేదు : మాజీ ప్రధాని దేవెగౌడ

బెంగళూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో ఉగ్రవాదుల దాడి విషయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీసుకునే నిర్ణయానికి సంపూర్ణమద్దతు ఇస్తామని మాజీ ప్రధాని దేవెగౌడ తెలిపారు. మంగళవారం బెంగళూరులో మీడియాతో మాట్లాడిన ఆయన ఉగ్రవాదులతోపాటు వారి వెనుక ఉండే శక్తులను అణిచేందుకు ప్రధానమంత్రితోపాటు కేంద్రప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు జేడీఎస్ పార్టీ సంపూర్ణమద్దతు ఉంటుందన్నారు. ఈ విషయంలో రాజకీయాలు చేయరాదన్నారు. కశ్మీర్ సంఘటనపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మద్దతు ఇస్తామని తెలిపారన్నారు. ఆ పార్టీలో ఇతరుల ప్రస్తావన వద్దంటూ దాటవేశారు. మోదీ నాయకత్వాన్ని దేశం మాత్రమే కాదు ప్రపంచదేశాలు గౌరవిస్తున్నాయన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తోపాటు వివిధ దేశాల అధ్యక్షులు కశ్మీర్ సంఘటనను తీవ్రంగా ఖండించాయని భారత్‌కు మద్దతు ఇచ్చారన్నారు.

మరో మూడు వారాలు డీజీపీగా అలోక్ మోహన్

● సర్వీస్ పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ



బెంగళూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర డీజీపీ అలోక్ మోహన్ సర్వీసును మరో మూడు వారాలు పొడిగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిం ది. అలోక్‌మోహన్ సేవలు ఈనెల 30న బుధవారంతో ముగియనున్నాయి. కొత్త డీజీపీని నియమించే ప్రక్రియకంటే ముందుగా అలోక్‌మోహన్ సర్వీసులు మూడు వారాల పాటు పొడిగించారు. ఈ మేరకు సీఎం సిద్దరామయ్య, హోం మంత్రి పరమేశ్వర్, చీఫ్ సెక్రటరీ శాలిని రజనీశ్‌ల నేతృత్వంలోని కమిటీ నిర్ణయం తీసుకుంది. అలోక్‌మోహన్ డీజీపీగా బాధ్యతలు చేపట్టి మే 22తో రెండేళ్ల కానుంది. 1987 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి అలోక్‌మోహన్ 2023లో బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు డీజీపీగా కొనసాగిన ప్రవీణ్‌సూద్ సీబీఐ డైరెక్టర్‌గా కేంద్ర సర్వీసులకు వెళ్లడంతో ఖాళీ అయిన స్థానానికి సీనియారిటీ ప్రకారం అలోక్‌మోహన్ నియమితులయ్యారు. ప్రస్తుతం సీనియారిటీ ప్రకారం ప్రశాంత్‌కుమార్ ఠాకూర్‌ను డీజీపీగా నియమించాల్సి ఉంది. అయితే ఆ తర్వాత బ్యాచ్‌కు చెందిన డాక్టర్ ఎంఏ సలీం, డాక్టర్ రామచంద్రరావుల పేర్లు వినిపిస్తున్నాయి. సలీం పట్ల సీఎం సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. కన్నడిగుడు అయిన సలీంకు అవకాశం ఇవ్వాలని సీఎం భావిస్తున్నట్లు తెలుస్తోంది. కానీ డాక్టర్ రామచంద్రరావు తరపున డీసీఎం డీకే శివకుమార్, హోం మంత్రి పరమేశ్వర్‌లు మద్దతు ఇస్తున్నట్లు తెలుస్తోంది. రామచంద్రరావు పెంపుడు కుమార్తె నటి రన్యారావ్ బంగారం అక్రమ రవాణా కేసులో ఇరుక్కున్నారు. ఎవరిని ఎంపిక చేయాలనే విషయంలో మరో పదిరోజుల్లోనే ఒక నిర్ణయానికి వచ్చే వీలుంది. ఎవరికి అవకాశం దక్కనుందో తేలనుంది.





శిక్షలు.. కరువు..!

● మహిళలపై దాడుల కేసుల్లో శిక్ష పడింది కొందరికే..

● రెండేళ్లలో 25వేలకు పైగా కేసులు

● 35,204 మంది అరెస్ట్.. బెయిల్‌పై విడుదల

● ప్రత్యేక అధికారుల నియామకానికి కసరత్తు

(2023-2025 ఫిబ్రవరి దాకా) నమోదైన కేసులు నేరాలు

	కేసులు	అరెస్టులు
లైంగిక వేధింపులు	13,617	16,558
అత్యాచారం	1461	1662
వరకట్నం మృతులు	289	638
భర్త దౌర్జన్యాలు	6276	6517
వరకట్నం వేధింపు	4057	9829
మొత్తం	25,700	35,204
కేసులు	శిక్షలు	బయట పడినవారు
లైంగిక వేధింపులు	27	457
అత్యాచారం	--	40
వరకట్నం మృతులు	--	7
భర్త దౌర్జన్యాలు	11	284
వరకట్నం వేధింపు	01	178
మొత్తం	39	966

బెంగళూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మహిళలపై దాడులు, అత్యాచారాలు, వరకట్న సమస్యలు తదితర వాటిలో కేసులు నమోదయినా శిక్షలు మాత్రం కరువయ్యాయి. మహిళలంటే అబలలు కాదని నారీశక్తులని వారి అభ్యున్నతి కోసమే అన్ని గ్యారెంటీలను వారికే అందిస్తున్నామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోంది. మరోవైపు మహిళల్లో చైతన్యం వచ్చిందని అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారని నేల నుంచి నింగిదాకా దూసుకుపోతున్నారంటూ నేతలు ప్రతి సందర్భంలోను ప్రస్తావిస్తున్నారు. అయితే మహిళలపై జరుతుగుతున్న దాడుల్లో శిక్షలు పడకపోవడం విచారం కలిగిస్తోంది.

వేలాదిగా కేసుల నమోదు

రాష్ట్రంలో మహిళలపై లైంగిక వేధింపులు, అత్యాచారం, వరకట్నం వేధింపులు, దౌర్జన్యాలకు సంబంధించి ఏటా పోలీస్‌స్టేషన్‌లలో వేలాదికేసులు నమోదవుతున్నాయి. అయితే ఆరోపణలు ఎదుర్కొంటున్నవారు జైళ్లకు చేరకుండానే బయటపడడం ప్రమాదకరమైన పరిణామంగా మారుతోంది. ప్రభుత్వం అందిస్తున్న సమాచారం ప్రకారం 2023-25 రెండేళ్ల వ్యవధిలో రాష్ట్రవ్యాప్తంగా మహిళలపై దాడులు, హత్యలు తదితర వాటిపై 25,700 కేసులు నమోదయ్యాయి. ఈ కేసులకు సంబంధించి 35,204 మందిని అరెస్టు చేశారు. ఆ తర్వాత వారు బెయిల్‌పై విడుదలయ్యారు. రెండేళ్ల వ్యవధిలో శిక్షలకు గురైంది 32కేసుల్లో మాత్రమే. 966మంది నిరపరాధులుగా బయటపడ్డారు. కోర్టులలో వేలాదికేసులు పెండింగ్‌లోనే ఉన్నాయి. వీటిలో అధికంగా లైంగిక వేధింపులు, భర్తతోపాటు వారి కుటుంబ సభ్యులు వరకట్నం కోసం వేధింపులకు సంబంధించిన కేసులు ఉన్నాయి.

తప్పుడు కేసులు, సాక్ష్యాలు లేకపోవడం, విచారణకు గైర్హాజరు కావడం వంటివి కేసులు వీగిపోయేందుకు కారణమవుతున్నాయి. 2023 నుంచి 2025 ఫిబ్రవరి వరకు 25,700 కేసులు నమోదు కాగా బెంగళూరులోనే అత్యధిక కేసులు ఉన్నాయి. భార్యాభర్తలమధ్య ఏదో విధంగా విబేధాలు వచ్చినా లైంగిక వేధింపులు, వరకట్నం వంటి తప్పుడు కేసులు నమోదవుతున్నాయి. వరకట్నం, లైంగిక వేధింపులు వంటి అంశాలను రుజువు చేసేందుకు సాక్ష్యాలను సమర్పించలేకపోతున్నారు. కోర్టుకేసు విచారణ దశలోనే ఫిర్యాదుదారుడు, సాక్ష్యులు గైర్హాజరవుతున్నారు. మరోవైపు కోర్టుల్లో కేసులు విచారణదశకు వచ్చేసరికి న్యాయవాదులు, కుటుంబ పెద్దలు ఆవేశంలో ఏదో జరిగిపోయిందని రాజీ చేస్తున్నారు. ఫిర్యాదుదారులను బెదరించి కోర్టుకు రాకుండా చేసిన కేసులూ ఉన్నాయి.

● 2023లో లైంగిక వేధింపులకు సంబంధించి కేవలం 19మందికి మాత్రమే శిక్ష పడింది. 400 కేసులు వీగిపోయాయి. అత్యాచారానికి సంబంధించి ఒక్క కేసులోనూ శిక్ష పడలేదు. భర్త నుంచి దౌర్జన్యం ఆరోపణలతో 241 కేసులు రద్దు కేవలం 7 కేసులలో మాత్రమే శిక్షలు పడ్డాయి. వరకట్నానికి సంబంధించి 167 కేసులు వీగిపోగా కేవలం ఒక కేసులో మాత్రమే శిక్ష సాధ్యమైంది.

● 2024లో లైంగిక వేధింపులకు సంబంధించి 57 కేసులు కొట్టేయగా 8 కేసుల్లో శిక్షలు పడ్డాయి. భర్తనుంచి దౌర్జన్యం కేసులకు సంబంధించి 43 కేసులు కొట్టివేయగా కేవలం నలుగురికి మాత్రమే శిక్ష పడింది.

ప్రత్యేక అధికారుల నియామకానికి నిర్ణయం

కోర్టులలో కేసులు కొట్టివేస్తుండడంతో పోలీసుల దర్యాప్తులో మరిన్ని ఆధారాలు సేకరించేలా 206 సీన్ ఆఫ్ క్రైం కోసం ప్రత్యేకంగా అధికారులను నియమించాలని పోలీసుశాఖ భావిస్తోంది. అన్ని పోలీస్‌స్టేషన్లలోనూ సంఘటనలు జరిగాక ప్రత్యేక అధికారులు కేసు బలోపేతంకోసం భిన్నమైన కోణాలలో దర్యాప్తు చేయడం, సమగ్ర ఆధారాలు సేకరించేలా వ్యవహరించనున్నారు. ఇందుకోసం 500 అధికారులను నియమించుకుని నేరం జరిగిన స్థలంలో దర్యాప్తు కోసం సాక్ష్యాలను సేకరించడం, కోర్టుకు హాజరు పరచడం, నేరాల ద్వారా నిందితులకు శిక్షలు పడేలా ప్రయత్నించనున్నారు. వీటితోపాటు కోర్టులలో కొట్టివేసిన కేసులపై అధ్యయనం చేసేందుకు ప్రత్యేకమైన పాలకమండలిని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రమాదం జరిగినప్పుడు నిందితులు సైతం భయపడి నేరాన్ని అంగీకరించినట్లుగా ప్రచారం జరిగినా ఆ తర్వాత చట్టంలోని లొసుగుల ద్వారా కేసులనుంచి బయటపడుతున్నారు. సాధారణంగా చట్టం, న్యాయం ప్రకారం వందమంది నిందితులు తప్పించుకున్నా ఒక నిరపరాధికి శిక్ష పడరాదనేది నానుడి. అయితే శిక్షలకు కారకులైనవారే వివిధ సాంకేతిక కారణాలతో బయటపడుతుండాన్ని తగ్గించేందుకు రాష్ట్రస్థాయిలో నేర పరిశీలనా సమితిని ఏర్పాటు చేయనున్నారు. జిల్లాస్థాయిలోనూ కొట్టేసిన కేసులపై ఈ కమిటీలు అధ్యయనం చేయనున్నాయి. ప్రస్తుతానికి ఈ కమిటీల ఏర్పాటుకు పోలీసు శాఖ తీవ్ర కసరత్తు చేస్తోంది.

ఇంకో న్యాయవాది కావాలి..!

● కోర్టుకు ప్రజ్వల్ రేవణ్ణ వినతి

● ఒక్కరోజే గడువిచ్చిన న్యాయస్థానం



బెంగళూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): లైంగిక దాడి, అత్యాచారం కేసులను ఎదుర్కొంటున్న జేడీఎస్ మాజీ ఎంపీ ప్రజ్వల్‌రేవణ్ణ కొత్త న్యాయవాదిని నియమించుకునేందుకు గడువు కావాలంటూ కోర్టును కోరారు. ఇందుకు ప్రజాప్రతినిధుల కోర్టు కేవలం ఒక రోజు మాత్రమే గడువు ఇచ్చింది. దీంతో కేసులు వాదించేందుకు కొత్తలాయర్ కోసం భవాని రేవణ్ణ స్వయంగా రంగంలోకి దిగారు. ప్రజ్వల్ రేవణ్ణకు సంబంధించిన కేసులు నిరంతరంగా విచారణ జరపేలా ఇప్పటికే ప్రజాప్రతినిధుల కోర్టు నిర్ణయించిన విషయం తెలిసిందే. దాదాపు ఏడాదిగా ప్రజ్వల్ కేసులు వాదిస్తున్న సీనియర్ న్యాయవాది జి ఆరుణ్ కేసు నుంచి వెనుకడుగు వేశారు. ఇదే విషయాన్ని సోమవారం న్యాయమూర్తికి తెలియజేశారు. దీంతో కొత్తగా న్యాయవాదిని నియమించుకునేందుకు కొంతగడువు కావాలంటూ ప్రజ్వల్ రేవణ్ణ న్యాయమూర్తి సంతోష్‌గజానన భట్‌కు వివరించారు. ఓ విధంగా కొంతకాలం కేసులనుంచి ఉపశమనం పొందవచ్చునని ప్రజ్వల్ భావించారు. కానీ ఒక రోజులోనే మంగళవారం లోగా న్యాయవాదిని సమకూర్చుకోవాలంటూ న్యాయమూర్తి ఆదేశించారు. ఒక్కరోజు మాత్రమే గడువు ఉండటంతో నేరుగా ప్రజ్వల్ తల్లి భవాని రేవణ్ణ రంగంలోకి దిగారు. ప్రజాప్రతినిధులు కోర్టు చెంతకు వచ్చిన ఆమె పలువురు న్యాయవాదులతో తీవ్రంగా చర్చలు జరిపినట్లు తెలిసింది. ఓవైపు కేసులు ట్రయల్ చేపట్టాల్సింది ఉందంటూ న్యాయమూర్తి తెలిపారు. కనీసం మేనెల 2వ తేదీ వరకూ అయినా గడువు ఇవ్వాలంటూ ప్రజ్వల్ కోర్టులో కోరగా న్యాయమూర్తి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మీరు కోరినట్లుగా కోర్టు నడుచుకునేందుకు వీలుండదన్నారు. ఇదే సందర్భంలోనే కోర్టు హాలులోనే ఉన్న భవాని రేవణ్ణ కూడా ముందకు వచ్చి కొంతగడువు ఇవ్వాలని కోరే ప్రయత్నం చేయగా న్యాయమూర్తి పట్టించుకోలేదు. దీంతో మరో విధమైన ఎదురు దెబ్బ తగలనుందని భవాని రేవణ్ణ కోర్టు హాలు నుంచి బయటకు వెళ్ళిపోయారు. న్యాయసేవా ప్రాధికార అడ్వకేట్ తాత్కాలికంగా పాల్గొన్నారు.

కన్నంబాడి.. సందడే సందడి..!

● వేసవి సెలవుల కారణంగా పర్యాటకులతో కళకళ ● బ్యాక్‌వాటర్‌లో జలకాలాట.. వేణుగోపాలుడి దర్శనం



బ్యాక్ వాటర్‌లో ఈత కొడుతున్న పర్యాటకులు

బెంగళూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): కావేరి నదికి అనుబంధంగా ఉండే అత్యంత ప్రతిష్టాత్మకమైన కేఆర్ఎస్ ప్రాజెక్టు ప్రాంతాన్ని కన్నంబాడిలో పర్యాటకుల సందడి నెలకొంది. వేసవి సెలవుల కారణంగా పిల్లలు, పెద్దలు విచ్చేసి ఉత్సాహంగా గడుపుతున్నారు. ఈ ఆలయానికి విశేష ప్రాధాన్యం ఉంది. ప్రాజెక్టు నిర్మించినప్పుడు అత్యంత సుందరమైన వేణుగోపాలస్వామి ఆలయం నీట మునిగిపోయింది. ఆరు దశాబ్దాలపాటు వేణుగోపాలస్వామి ఆలయం ఎక్కడ ఉందనేది ఎవ్వరికీ అంతుబట్టలేదు. నీట ఉన్న ఆలయంలో ఉన్న వేణుగోపాలుడికి పూజలు చేపట్టిందీ లేదు. అయితే అత్యంత అద్భుతమైన ఆలయాన్ని కనుమరుగు కాకుండా చూడాలని ఖోడే సంస్థ ముఖ్యులు హరి ఖోడేకు వచ్చిన ఆలోచనతో ఓ కొత్త ఆలయం రూపుదిద్దుకుంది. నీట మునిగిన ఆలయాన్ని 2003లో గుర్తించి ప్రాజెక్టు ఒడ్డున ఎత్తైన ప్రదేశంలో నిర్మాణాలు చేపట్టారు. ప్రాజెక్టుకు నీరు చేరితే పనులు సాగవు. ఇలా ఎండా కాలంలో నీటిమట్టం తగ్గినప్పుడు మాత్రమే ప్రాచీన ఆలయంలోని ఒక్కో భాగాన్ని తరలించే ప్రక్రియ కొనసాగించారు. ఇలా 14ఏళ్లపాటు కొనసాగించి 2017 నాటికి సర్వాంగ సుందరంగా వేణుగోపాలస్వామి ఆలయం కొలువుదీర్చారు. హొయసళ కాలంలో నిర్మించిన శిల్పకళలు, స్తంభాలను యథావిధిగా పొందుపరిచారు. ఆలయ ప్రాంగణంలో హంపిలోని రాతి రథం నమూనాను రూపొందించారు. ఈ ఆలయానికి ఓ ప్రత్యేకత ఉంది. గర్భగుడిలో వేణుగోపాలస్వామిని దర్శించుకుని ప్రదక్షిణ చేస్తే రుషులు, దేవతామూర్తుల రూపాలు ప్రత్యేకంగా దర్శనమిస్తాయి. ఆలయంలో అగర్బత్తీ, కర్పూరం వెలిగించరు. హుండీ లేదు. వాహనాల పార్కింగ్ చార్జీ ఉండదు. శౌచాలయం వాడకానికి చార్జీలు లేవు. వేసవి కాలంలో ఎక్కువమంది సందర్శకులు వస్తుంటారు.



హంపి రాతిరథం నమూనా



పురాతన వేణుగోపాలస్వామి దేవాలయం



వీపున ఇనుప కొక్కీలు తగిలించుకుని వేలాడుతున్న మత్స్యకారులు

వైభవంగా కాలమ్మ ఉత్సవాలు

కంప్లి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): కంప్లి కోటలో నివసిస్తున్న మత్స్యకారులు తమ ఆరాధ్య దైవమైన కాలమ్మదేవి ఉత్సవాలను మంగళవారం వైభవంగా జరుపుకున్నారు. వంశపారంపర్యంగా వస్తున్న పద్దతి ప్రకారంగా అమ్మవారి భావచిత్రపటం ఊరేగింపు నిర్వహించారు. ఈ ఊరేగింపులో వీపుకి కొక్కిలు తగిలించుకుని వేలాడుతూ భక్తిని చాటుకున్నారు. మహిళలు నోటిలో పెద్ద పెద్ద సూదులను గుచ్చుకుని అమ్మవారికి మొక్కులు సమర్పించుకున్నారు. ఆలయంలో ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకరణ, మహా మంగళహారతి, కుంకుమ పూజ నిర్వహించారు. కార్యక్రమంలో సమీప గ్రామాలు మత్స్యకారులు విశేషంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘంఅధ్యక్షుడు రాజశేఖర్, గురుమూర్తి, మరియప్ప, కృష్ణమూర్తి, గణేష్,చిన్నరాజ్, శంభుధర్ తదితరులు పాల్గొన్నారు.



దవడలకు ఇనుప చువ్వలు గుచ్చుకుని..

కళాశాలకు బాంబు బెదిరింపు

బెంగళూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని ఆచార్య కళాశాలకు బాంబుబెదరింపు సందేశం వచ్చింది. ఇ-మెయిల్ ద్వారా కళాశాలలో బాంబు పెట్టామని హెచ్చరిస్తూ సందేశం పంపారు. ప్రిన్సిపాల్‌ను ముక్కలుగా చేసి ఫ్రిజ్‌లో పెడతామంటూ హెచ్చరించారు. కళాశాలకు సంబంధించిన ఇ-మెయిల్ పరిశీలిస్తుండగా బెదరింపు సందేశం వెలుగులోకి వచ్చింది. వెంటనే పాలకమండలి సోలదేవనహళ్ళి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈమేరకు ఎన్‌సీఆర్ నమోదు చేసుకుని కోర్టు అనుమతితో మంగళవారం ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. తనిఖీలు జరిపారు. బెంగళూరు నుంచి వారణాసికి వెళ్లే ఇండిగో విమానంలో బాంబు పెట్టామంటూ బెదరించిన వివాదం మరువకముందే కళాశాలకు బాంబు బెదిరింపు వచ్చింది.

హోటల్ వ్యాపారి ఆత్మహత్య

బెంగళూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): వ్యాపారంలో భారీగా నష్టాలు రావడంతో ఉడుపి జిల్లాకు చెందిన హోటల్ యజమాని దిలీప్ తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మంగళవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. ఉడుపి జిల్లా తెళ్ళారుకు చెందిన ఎన్ఆర్ దిలీప్.. కార్కళ పురసభ మాజీ వైస్ చైర్మన్. కొన్నేళ్ళుగా మంగళూరు, ముంబై, హైదరాబాద్‌లో హోటళ్ళను నిర్వహిస్తున్నారు. ఇటీవల హోటల్ వ్యాపారంలో భారీగా నష్టాలు వచ్చాయి. దీనికితోడు కిడ్నీ జబ్బుకు గురైనట్లు తెలుస్తోంది. దీంతో మానసికంగా కుంగిపోయినట్లు సమాచారం. సోమవారం రాత్రి పొద్దు పోయాక స్నేహితులు, ఆప్తులకు వాట్సాప్ ద్వారా 'నేను మిమ్ములను వదిలి దూరంగా వెళుతున్నా..' అని మెసేజ్ చేశారు. ముంబైకి చెందిన ఓ హోటల్ యజమాని వెంటనే గమనించి, దిలీప్ సోదరుడికి ఫోన్ చేసి అప్రమత్తం చేశారు. దిలీప్ సోదరుడు తన కుటుంబ సభ్యులు, మిత్రులతో కలిసి రాత్రంతా గాలించారు. దిలీప్ ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. కార్కళ సమీపంలో మొబైల్ లొకేషన్‌ను తెల్లవారు జామున గుర్తించారు. పోలీసులు వెళ్లేసరికే ఆయన ఆత్మహత్య చేసుకున్నారు. ముందుగా విషం కలిపిన స్వీట్లు తిన్న దిలీప్, ఆ తర్వాత తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. కార్కళ గ్రామీణ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కారులో ఉన్న తుపాకీ, బుల్లెట్‌లు, స్వీట్‌బాక్సును స్వాధీనం చేసుకున్నారు. దిలీప్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మణిపాల్‌లోని కేఎంసీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని, అన్ని కోణాలలో దర్యాప్తు జరుపుతున్నారు.

లారీ ఢీకొని పౌరకార్మికురాలి మృతి

విజయనగర్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొన్న ప్రమాదంలో పౌరకార్మికురాలు మృత్యువాత పడింది. మంగళవారం ఉదయం రాజాజీనగర్ శివనగర్ వార్డు పరిధిలో వెస్ట్‌ఆఫ్ కార్డ్ సర్కిల్‌లో రోడ్డు దాటుతుండగా టిప్పర్ లారీ ఢీ కొనడంతో పౌరకార్మికురాలు సరోజ (50) అక్కడికక్కడే మృతి చెందింది. ఆమెకు ఇద్దరు కొడుకులు, ఒక కుమార్తె ఉన్నారు. ఇటీవల పౌరకార్మికులను పర్మనెంట్ చేశారు. ఐపీడీ సాలప్ప లే అవుట్‌లో ఉంటున్న ఈమె ఇందుకు సంబంధించిన కాగితాలతో ఉదయం డ్యూటీకి వెళ్తున్న వేళ ప్రమాదానికి గురై మృత్యువాత పడిందని తోటి సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు.



సరోజ (ఫైల్)

విద్యా వ్యవస్థకు ఆదర్శం

స్కూళ్లలో సంస్కరణలకు ప్రభుత్వం శ్రీకారం

● పంచాయతీకో మోడల్ ప్రైమరీ స్కూల్.. ● వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమలు



ఆదర్శ పాఠశాల

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రతి గ్రామ పంచాయతీలో మోడల్ ప్రైమరీ పాఠశాలను ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సాధ్యాసాధ్యాలను అన్వేషిస్తోంది. ఉపాధ్యాయులు తీవ్రంగా వ్యతిరేకించిన జీఓనెంబరు 117కు ప్రత్యామ్నాయంగా ఆదర్శపాఠశాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈవిధానంపై విద్యాశాఖలో తీవ్ర కసరత్తు జరుగుతోంది.

287 పాఠశాలల మార్పు

జిల్లాలో 287 పాఠశాలలను మోడల్ స్కూళ్లుగా మార్చేందుకు జిల్లా విద్యాశాఖాధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. గత ఏడాది డిసెంబరు ఆఖరునాటికి కనీసం 60 మంది విద్యార్థులున్న పాఠశాల లను ఎంపిక చేయనున్నారు. అయితే పంచాయతీలో ఏ పాఠశాలలోనూ అంతమంది విద్యార్థులు లేకపోతే 45 మంది విద్యార్థులున్న పాఠశాల లను కూడా పరిగణనలోకి తీసుకోనున్నట్లు సమాచారం.

ప్రతి తరగతికీ ఒక ఉపాధ్యాయుడు

ఎంపిక చేసిన ఆదర్శపాఠశాలలో ఒకటి నుంచి ఐదు వరకు ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయున్ని నియమిస్తారు. విద్యార్థుల సంఖ్య 60 మందికి లోపు ఉంటే ఐదుగురు ఎస్జీటీలు ఉంటారు. ఆసంఖ్య 120 వరకు ఉంటే ప్రధానోపాధ్యాయుడిని నియమిస్తారు. విద్యార్థుల సంఖ్యను బట్టి అవసరమైతే రెండో పాఠశాల ఏర్పాటుకు అనుమతి ఇవ్వనున్నారు.

గ్రామస్థులు కోరితే..

గ్రామపంచాయతీలో ఏ ప్రాథమిక పాఠశాలలోనైనా విద్యార్థుల సంఖ్య 45 మందికి మించి ఉంటే గ్రామస్థుల కోరిక మేరకు ఆపాఠశాలను ఆదర్శపాఠశాలగా మార్చనున్నారు. గ్రామపంచాయతీ తీర్మానం, విద్యాకమిటీ చైర్మన్, ఇతర సభ్యుల ఆమోదంతో ప్రక్రియను పూర్తి చేస్తారు.

విభజన ఆరు రకాలుగా....

జిల్లాలో మొత్తం 2097 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 1553 ప్రాథమిక పాఠశాలలు, 229 ప్రాథమికోన్నత పాఠశాలలు, 315 ఉన్నత పాఠశాలలున్నాయి. వీటిని ఆరురకాల పాఠశాలలుగా విభజించనున్నారు. ఇందులో ఆదర్శ పాఠశాలలు ప్రధానమైనవి. ప్రాథమిక విద్యలో నాణ్యతాప్రమాణాలు పెంచడమే ఆదర్శ పాఠశాల ఏర్పాటు చేయడంలో ముఖ్య ఉద్దేశం. ఈ నేపథ్యంలో ప్రస్తుత పాఠశాల ప్రాంగణాల్లో మౌలిక వసతులు, నూతనంగా కల్పించాల్సిన సౌకర్యాలపై ప్రాథమిక నివేదికలు ఇవ్వాలని జిల్లా విద్యా శాఖాధికారులు ఎంఈఓలను ఆదేశించారు.



విలీనం చేసిన తరగతులు వెనక్కు

వైసీపీ పాలనలో 3, 4, 5, తరగతులను ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. దీంతో నివాసానికి దూరంగా ఉన్న పాఠశాలకు వెళ్లలేక ఎక్కువ మంది విద్యార్థులు బడి మానేశారు. చాలా పాఠశాలల్లో అతితక్కువ మంది విద్యార్థులు మిగిలారు. కొన్ని పాఠశాలల్లో ఒకరు ఇద్దరు విద్యార్థులతో నెట్టుకొస్తున్నారు. అయితే ప్రభుత్వం ఉన్నత పాఠశాలల్లో విలీనమైన తరగతులను తిరిగి ప్రాథమిక పాఠశాలల్లోకి తీసుకురావాలని నిర్ణయం తీసుకుంది.



పుట్టపర్తి పట్టణం

సులభంగా అనుమతులు

కమిషనర్లకే పర్మిషన్ బాధ్యతలు

మున్సిపాల్టీలో ఐదంతస్తుల నిర్మాణం వరకూ...

బిల్డర్లకు తప్పిన వ్యయ ప్రయాసలు

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మునిసిపాలిటీల్లో ఐదంతస్తుల భవననిర్మాణ అనుమతులు సులభతరం అయ్యాయి. గతంలో నాలుగు అంతస్తులకు మించి భవన నిర్మాణాలకు మున్సిపాలిటీ అధికారులు అనుమతి ఇచ్చేవారు కాదు. దీంతో పుడా, లేదా అహుడా అధికారుల నుంచి అనుమతి పొందాల్సి వచ్చేది. ఇందుకోసం భవన నిర్మాణదారులు ఎన్నో వ్యయప్రయాసలు ఓర్వాల్సి వచ్చేది. ఈ ఇబ్బందులను గమనించిన రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కమిషనర్లకే అనుమతి అధికారం మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఈమేరకు ఫిబ్రవరి 2న జీఓ ఎంఎస్ నెంబరు 20ను విడుదల చేసింది. దీన్ని అనుసరించి ప్రజలు సులభంగా స్వీయ అంగీకార ధ్రువీకరణ పత్రం అందజేసి భవననిర్మాణ అనుమతులు పొందడానికి వీలు కల్పించారు. ఈ విధానం ద్వారా బిల్డర్లకు బహుళ అంతస్తులను నిర్మించుకునే విషయంలో ఊరట కలిగింది. దీంతో నిర్మాణ రంగం ఊపందుకునే అవకాశం ఉన్నట్లు పలువురు అభిప్రాయ పడుతున్నారు.

ఏకకాలంలో అనుమతులు



ప్రహ్లాద, మున్సిపల్ కమిషనర్

ఏకకాలంలో అనుమతులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీంతో ఒకే పోర్టల్‌లో అన్ని అనుమతులు పొందే అవకాశం కలిగింది. గత ప్రభుత్వంలో బహుళ అంతస్తుల నిర్మాణాల అనుమతుల కోసం వేచి చూసే కార్యక్రమంతో పాటు లక్షల్లో డబ్బులు చెల్లించాల్సి వచ్చేది. దీంతో వైసీపీ ప్రభుత్వ పాలనలో నిర్మాణరంగం పూర్తిగా కుదేలైంది. ఈ సమస్యలను గుర్తించిన ప్రస్తుత మున్సిపల్‌శాఖా మంత్రి నారాయణ భవన నిర్మాణాలకు ఏకకాలంలో అనుమతుల మంజూరు చేసే విధానానికి శ్రీకారం చుట్టారు. భవన నిర్మాణ అనుమతులు స్థానికంగా ఉన్న మున్సిపల్ కమిషనర్ పరిధిలోనే జరుగుతుండటంతో బిల్డర్లకు వెసులుబాటు లభించింది. వారికి వ్యయప్రయాసలు తప్పాయి. దీంతో జిల్లాలోని ధర్మవరం, కదిరి, పుట్టపర్తి, హిందూపురం వంటి మున్సిపాలిటీల్లో బహుళ అంతస్తుల భవననిర్మాణాలకు ఆన్‌లైన్‌లోనే అనుమతులు పొందే అవకాశం ఏర్పడింది. ఇందుకు సంబంధించి దరఖాస్తుదారులు స్వీయ ధ్రువీకరణ పత్రాన్ని లైసెన్సుడు టెక్నికల్ సర్వేయర్, ఇంజనీర్‌కు ఆన్‌లైన్‌లోకాని నేరుగా కాని అందజేయవచ్చని పుట్టపర్తి మునిసిపల్ కమిషనర్ ప్రహ్లాద తెలిపారు.

ఎదురుచూపులు

ఎన్నాళ్లు..?


ఆర్భాటంగా బీసీ రుణాల మెగా చెక్కు విడుదల

20 రోజులు కావస్తున్నా...

లబ్ధిదారుల ఖాతాలకు జమకాని డబ్బు

విడుదల కాని బడ్జెట్

పొదుపు ఖాతాల ఫ్రీజ్‌తో ఇబ్బందులు



అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణాల లబ్ధిదారులకు ఎదురుచూపులు తప్పలేదు. ఆర్భాటంగా రుణాల మెగా చెక్కు విడుదల చేసి, డబ్బు మాత్రం జమ చేయలేదని వారు వాపోయారు. కార్పొరేషన్ ద్వారా బీసీ వర్గాలకు సబ్సిడీ రుణాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు ప్రక్రియ చేపట్టింది. అన్నీ అనుకున్నట్లుగానే దరఖాస్తులు చేసుకోవడం... వెరిఫికేషన్.. బ్యాంకర్లకు అందజేయడం... ఆర్భాటంగా ఈనెల 11వ తేదీన అదికూడా జ్యోతిబాపూలే జయంతి రోజున రూ.11.61 కోట్ల మెగాచెక్కును ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, కలెక్టర్ వినోద్‌కుమార్ విడుదల చేశారు. ఇక రెండుమూడ్రోజుల్లో లబ్ధిదారుల ఖాతాలకు రుణం మొత్తం జమవుతుందన్న ప్రచారం జోరుగా సాగింది. సీన్ కట్ చేస్తే... మెగా చెక్కు విడుదల చేసి 20 రోజులవుతున్నా... జిల్లాలో ఒక్కరంటే ఒక్క లబ్ధిదారు డికి రుణం అందిన దాఖలాలు లేవనే చెప్పాలి. దీంతో లబ్ధిదారులకు నిట్టూర్పు తప్పడం లేదు.

సేవింగ్స్ ఖాతాలు ఫ్రీజ్

బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాల పంపిణీ ప్రక్రియకు సంబంధించి తతంగమంతా ముగిసిందనే చెప్పాలి. ఈ నేపథ్యంలోనే మెగా చెక్కు విడుదల అనంతరం దరఖాస్తులు ఆయా బ్యాంకర్లకు వెళ్లిపోయాయి. ఆయా బ్యాంకర్లు.. సిబిల్ స్కోరు తదితరాలను పరిశీలించి, లబ్ధిదారుల ఖాతాను ఫ్రీజ్ చేశారు. ఇక్కడే కొందరు బ్యాంకర్లు తప్పులే కాలేశారు. సబ్సిడీ రుణాలు విడుదల చేయాలంటే... లబ్ధిదారుడికి ఖాతా ఉన్న బ్యాంకులో రుణానికి మరో ఖాతా తెరిచేవారు. ఈసారి కొందరు బ్యాంకర్లు.. లబ్ధిదారుడికి ఉన్న ఒకే ఒక సేవింగ్స్ ఖాతాను ఫ్రీజ్ చేశారు. అందులోనూ సబ్సిడీ మొత్తాన్ని హోల్డ్ చేసి... మిగిలిన రుణం మొత్తాన్ని మైనస్‌లో చూపించేశారు. ఇదంతా బ్యాంకు సేఫ్టీ ప్రకారం చూసుకున్నారనప్పటికీ.. మైనస్‌లో చూపిస్తుండటంతో లబ్ధిదారులు బ్యాంకు లావాదేవీలు జరిపేందుకు వీలులేకుండా పోయిందనే చెప్పాలి. దీంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. పైగా... మెగా చెక్కు విడుదలై 20 రోజులు కావస్తున్నా రుణాలు అందకపోవడం, మే నెల వస్తుండటంతో లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది. అకౌంట్‌లో మైనస్ చూపిస్తుండటంతో ఆ నెలలో ఈఎంఐలు కట్టుకునే వారి పరిస్థితి దయనీయంగా మారిందనే చెప్పాలి. దీనిపై పలువురు లబ్ధిదారులు.. బీసీ కార్పొరేషన్ అధికారుల వద్ద వాపోయినట్లు సమాచారం.

విడుదలకాని బడ్జెట్..?

రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేయకపోవడంతోనే బీసీ కార్పొరేషన్ రుణాలు పెండింగ్‌లో ఉన్నట్లు ఆ శాఖ ద్వారా అందిన సమాచారం. జ్యోతి బాపూలే జయంతి రోజున ఆర్భాటంగానే మెగా చెక్కు విడుదల చేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఈ రుణాలకు సంబంధించి బడ్జెట్ రిలీజ్ చేయడంలో ఆలస్యం కావడమే ప్రధాన కారణమన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఆ శాఖాధికారుల ద్వారా అందిన సమాచారం మేరకు... మే 15వ తేదీలోపుగానీ, మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉంది.

సమాచారం లేదు



లబ్ధిదారుల ఖాతాలకు రుణ మొత్తాలు జమయ్యే అంశం మా పరిధిలో లేదు. నిధులు విడుదలైతే లబ్ధిదారుల ఖాతాలకు డబ్బులు జమవుతాయి.

- సుబ్రహ్మణ్యం, ఈడీ, బీసీ కార్పొరేషన్



ఈనెల 11న కలెక్టర్, ఎంపీ ఆధ్వర్యంలో విడుదల చేసిన మెగాచెక్కు

అనంతకు వరం.. ఆర్డీటీ: గౌస్‌మొద్దీన్



అనంతపురం అర్బన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): జిల్లాకు ఆర్డీటీ ఒక వరమని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్ మొద్దీన్ అన్నారు. నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో మంగళవారం మీడియాతో మాట్లాడారు. వెనుకబడిన జిల్లాలో 56 ఏళ్లుగా ఆర్డీటీ విద్య, వైద్య సేవలు అందిస్తోందని, పేదరిక నిర్మూలనకు కృషి చేస్తోందని అన్నారు. ఎంతో మంది క్రీడాకారులను తయారుచేసిన ఘనత ఆర్డీటీదని అన్నారు. బత్తలపల్లి, కళ్యాణదుర్గం, కణేకల్లు ప్రాంతాల్లో ఆస్పత్రుల ద్వారా పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందుతున్నాయని గుర్తు చేశారు. ఆర్డీటీ సహకారంతోనే తాను అధ్యక్షుడిగా ఉన్నప్పుడు జిల్లాలో డిజిటల్ గ్రంథాలయాన్ని పూర్తి చేశామని అన్నారు. ఆర్డీటీకి వెంటనే ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్ చేయాలని, నిధులు అందేలా కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కారం అయ్యేలా చూస్తామని అన్నారు.

క్రమబద్ధీకరణపై సమాలోచనలు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ, అనుబంధ శాఖల్లో పనిచేస్తున్న సిబ్బంది క్రమబద్ధీకరణపై ఆయా శాఖల ఉన్నతాధికారులు సమాలోచనలు జరిపారు. జేడీఏ కార్యాలయంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి, ఉద్యాన శాఖ డీడీ ఫిరోజ్ ఖాన్, సెరికల్చర్ డీడీ ఆంజనేయులు, జేడీఏ ఆఫీస్ టెక్నికల్ ఏఓ వెంకట్‌కుమార్, హెచ్ఓ రత్నకుమార్‌లు సిబ్బంది క్రమ బద్ధీకరణపై మంగళవారం సుదీర్ఘంగా చర్చించారు. జిల్లాలోని 450 రైతు సేవా కేంద్రాల పరిధిల్లో 189 ఉద్యాన సహాయకులు, 123 మంది వ్యవసాయ సహాయకులు, 9 మంది పట్టు పరిశ్రమ సహాయకులు, 189 మంది ఎంపీఈఓలు పనిచేస్తున్నారు. క్లస్టర్ వారిగా ఆయా పరిధిల్లో ఏఏ రకాల పంటలు ఎక్కువగా సాగువుతున్నాయో ఆయా శాఖల సిబ్బందిని అక్కడ నియమించేందుకు జాబితాలు తయారు చేయాలని నిర్ణయించారు. క్రమబద్ధీకరణ తర్వాత సిబ్బంది బదిలీలు జరిగేలా రాష్ట్ర ఉన్నతాధికారులు నిర్ణయించినట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ పేర్కొన్నారు.



చర్చిస్తున్న వ్యవసాయ, అనుబంధ శాఖల ఉన్నతాధికారులు

ఆర్డీటీకి అండగా ఉంటాం

ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్



మాంచో ఫెర్రర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్/కల్చరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీకి అండగా ఉంటామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. ఆ సంస్థ కార్యాలయంలో ఆర్డీటీ ప్రోగ్రామ్ డైరెక్టర్ మాంచో ఫెర్రర్‌ను మంగళవారం కలిశారు. విదేశీ నిధులు ఆగిపోయిన కారణంగా నిలిచిపోయే సేవల గురించి ఆరా తీశారు. ఆర్డీటీకి అండగా నిలవాలని ఇప్పటికే ఎమ్మెల్యేలందరం చర్చించుకున్నామని, త్వరలోనే సీఎం చంద్రబాబును కలుస్తామని ఆయనకు తెలిపారు. మే 2న ప్రధాన మంత్రి రాష్ట్రానికి వస్తున్నారని, ఆయన దృష్టికి ఆర్డీటీ అంశాన్ని తీసుకువెళతామని అన్నారు.

సేవ్ ఆర్డీటీ..

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్ అయ్యేలా సహకరించాలని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌ను సేవ్ ఆర్డీటీ కమిటీ సభ్యులు కోరారు. టీడీపీ అర్బన్ కార్యాలయంలో కమిటీ సభ్యులు షకీల్ షఫి, సీపీఎం నాయకుడు రాంభూపాల్, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, కాంగ్రెస్ నాయకుడు దాదాగాంధీ తదితరులు ఎమ్మెల్యేని కలిసి వినతి పత్రం సమర్పించారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. సీఎం, ప్రధాని దృష్టికి తీసుకువెళతామని, అవసరమైతే తానే ఢిల్లీకి వెళతానని అన్నారు.

ఆర్డీటీ కోసం ఉద్యమిద్దాం: జేసీ ప్రభాకర్ రెడ్డి



ఆర్డీటీని బతికించుకుందామంటూ ప్రదర్శన చేస్తున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ కోసం పార్టీలకు అతీతంగా కలిసి ఉద్యమిద్దామని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. కలెక్టరేట్ కూడలి వద్ద మంగళవారం టీడీపీ నాయకులతో కలిసి ప్రదర్శన చేశారు. విన్సెంట్ ఫెర్రర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అక్కడి నుంచి ఆర్డీటీ కార్యాలయానికి చేరుకొని మాంఛో ఫెర్రర్‌ను కలిసి మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కరువు జిల్లా ప్రజలకు ఆర్డీటీ అనేక సేవలు అందిస్తోందని అన్నారు. కోవిడ్ సమయంలో ఆర్డీటీ అందించిన వైద్య సేవలు ఎవరూ మర్చిపోలేరని అన్నారు.ప్రభుత్వం చేయలేని పనులు కూడా ఆర్డీటీ సంస్థ చేస్తోందన్నారు. ఆర్డీటీ కోసం పార్టీలకు అతీతంగా నాయకులంతా కలిసి రావాల్సిన సమయం వచ్చిందన్నారు. ఈ అంశం కేంద్ర ప్రభుత్వం పరిధిలో ఉందని, సీఎం చంద్రబాబు, మంత్రి నారాలోకేశ్ దృష్టికి తీసుకువెళ్లి ఆర్డీటీని బతికించుకుందామన్నారు.

ఎట్టకేలకు పట్టారు..!

అక్రమ పట్టాల రద్దుకు రంగం సిద్ధం

37మంది అనర్హులకు నోటీసులు జారీ

సంజాయిషీ కోసం నేడు ఆర్డీఓ వద్దకు..

కుణుతూరు జగనన్న లేఅవుట్‌లో అక్రమాల తతంగం



కుణుతూరు జగనన్న లేఅవుట్ ఇళ్ల నిర్మాణం

ధర్మవరంరూరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): కుణుతూరు జగనన్న లేఅవుట్‌లో అనర్హుల పట్టాల రద్దుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. గత ప్రభుత్వంలో కొందరు వైసీపీ నాయకులు, కార్యకర్తలు అక్రమంగా పట్టాలు పొందారు. అయితే ప్రస్తుత ప్రభుత్వ విచారణలో వారంతా అనర్హులని తేలింది. దీంతో అనర్హుల జాబితాను సిద్ధం చేసి వారి పట్టాలను రద్దు చేసేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఈక్రమంలోనే వారి పట్టాల రద్దుకు నోటీసులు జారీచేశారు. ఆర్డీఓ వద్ద సంజాయిషీ ఇవ్వాలని అందులో పేర్కొన్నారు.

167 మందికి పట్టాల పంపిణీ

ధర్మవరం మండలంలోని కుణుతూరు పంచాయతీలో 167మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. మామిళ్లపల్లి-ధర్మవరం ప్రధాన రహదారికి ఆనుకుని పట్టాలు పంపిణీ చేశారు. వీటి విలువ రూ.లక్షలు ఉండటంతో కొందరు వైసీపీ నాయకులు తమ అనుచరులు, పార్టీకోసం పనిచేసిన వారికి అప్పనంగా కట్టబెట్టారు. కుణుతూరు జగనన్న లేఅవుట్ వేసి పట్టాలు పంపిణీ చేశారు. ఇందుకుగాను కుణుతూరు పొలంలో సర్వేనెంబర్ 382-1, 387-1, 388-1, 389-1, 406-4బీలో స్థలాలు కేటాయించారు. ముందుగా ఈ లేఅవుట్‌లో అప్పటి ఎమ్మెల్యే చేతుల మీదుగా 30మందికి ఇళ్లపట్టాలు పంపిణీ చేశారు. మిగిలిన పట్టాలను ఆ పంచాయతీ ప్రధాన వైసీపీ నాయకుల కనుసన్నల్లో పంపిణీ చేశారు. అయితే కొత్త ప్రభుత్వం రాగానే జగనన్న లేఅవుట్‌లోని అనర్హులను గుర్తించాలని అధికారులను ఆదేశించింది. ఈ లేఅవుట్‌లో అనర్హులకు పట్టాలు పంపిణీ చేశారని, 2021లో అదే గ్రామానికి చెందిన గొడ్డుమర్రి వెంకటేష్ లోకాయుక్తను ఆశ్రయించారు. వివాదం కోర్టులో ఉన్నప్పటికి హౌసింగ్ అధికారులు మాత్రం లబ్ధిదారులతో కుమ్మక్కై బిల్లులు కూడా మంజూరు చేసినట్లు తెలుస్తోంది.

37మందికి నోటీసులు

కుణుతూరు జగనన్న లేఅవుట్‌లో 37మందిని మాత్రమే అనర్హులుగా గుర్తించారు. వారి పట్టాలు రద్దు చేసేందుకు ఆర్డీఓ కార్యాలయ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈనెల 30న విచారణకు రావాలని నోటీసులో పేర్కొన్నారు. విచారణకు రాకపోతే పట్టాలు రద్దు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అయితే పట్టాలు పొందిన వారిలో ఇంకా చాలామంది అనర్హులు ఉన్నారని, వారికెందుకు నోటీసులు ఇవ్వలేదని అదే గ్రామస్థులే అధికారులు వద్ద ఆగ్రహం వ్యక్తం చేశారు. నిష్పక్షపాతంగా అధికారులు విచారణ చేసి అనర్హులను పూర్తిగా తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

విచారణకు వస్తారా.. డుమ్మా కొడతారా?

అనర్హులుగా తేల్చిన 37మందిలో సుమారు 33మంది దాకా నోటీసులు తీసుకున్నట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. వీరంతా విచారణకు హాజరవుతారా లేక డుమ్మా కొడతారా అనేది వేచిచూడాలి. నోటీసులు తీసుకున్న వారు 'మేము ఇళ్లు కట్టుకున్నాం. ఎవరేమి చేస్తారు? విచారణకు మా నాయకులు చెబితే పోతాం. లేదంటే లేదు. ఏమైనా చేయనిలే. మా ప్రభుత్వం మళ్లీ రాదా' అంటున్నట్లు సమాచారం. విచారణకు వెళ్లకపోతే పట్టాలు రద్దు చేస్తే ఎలా అంటూ మరికొంతమంది సందిగ్ధంలో పడ్డారు.

నోటీసులు తీసుకునేందుకు వైసీపీ నాయకులు ససేమిరా..?

కుణుతూరు పంచాయతీలోని కుణుతూరు, కట్టకిందపల్లి, కామిరెడ్డిపల్లి గ్రామాలు వస్తాయి. ఈ గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలే అప్పట్లో పట్టాలు పొందారు. కుణుతూరు, కామిరెడ్డిపల్లిలోని ఆగ్రామ వైసీపీ నాయకుల పేరు మీద పట్టాలు ఉన్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించి వారికి నోటీసులు జారీచేశారు. నోటీసులు తీసుకుని రెవెన్యూ అధికారులు ఆ నాయకుల ఇళ్ల వద్దకు వెళితే మీరు ఇచ్చే నోటీసులు తీసుకోం అనడంతో దిక్కుతోచక ఆ గ్రామస్థాయి సిబ్బంది వెనుతిరిగినట్లు సమాచారం. పొజిషన్ పట్టాలు పొందినట్లు రికార్డుల్లో పేర్లు ఉన్నాయని చెప్పినా వినకుండా వెనక్కు పంపినట్లు సమాచారం.



అనర్హుల ఇళ్లపట్టాలు రద్దుచేసేందుకు రెవెన్యూ అధికారులు జారీచేసిన నోటీసులు

పట్టాల రద్దుకు చర్యలు




ఇళ్ల పట్టాలు పొందిన వారిలో 37మందిని అనర్హులుగా గుర్తించి, నోటీసులు జారీచేశాం. వారిని ఈనెల 30న విచారణకు రావాలని నోటీసులో తెలిపాం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అనర్హులు పట్టాలు తీసుకున్నట్లు తేలింది. వీరంతా ఆధారాలతో విచారణకు వచ్చి సంజాయిషీ ఇచ్చుకోవాలి. లేనిపక్షంలో వీరందరి ఇంటి పట్టాలు రద్దుకు తగు చర్యలు తీసుకుంటాం.

మహేష్, ఆర్డీఓ, ధర్మవరం

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయమ్...

దాదాసాహెబ్ ఫాల్కే (జయంతి)



'ది ఫాదర్ ఆఫ్ ఇండియన్ సినిమా'గా పేరొందిన దర్శకుడు, నిర్మాత ధుండిరాజ్ గోవింద్ ఫాల్కే 1870 ఏప్రిల్ 30న బాంబే ప్రాంతంలో జన్మించారు. తొలి సినిమా 1913లో 'రాజా హరిశ్చంద్ర'తోనే గుర్తింపు సాధించారు. 19ఏళ్ల కెరీర్‌లో 95 ఫీచర్ లెంగ్త్ సినిమాలు, 27 షార్ట్ ఫిలిమ్స్ తీశారు. మోహిని భస్మాసుర (1913), సత్యవన్ సావిత్రి (1914), లంకా దహన్ (1917), శ్రీకృష్ణ జన్మ (1918), కాళీయమర్దన్ (1919) వంటి సినిమాలు ఎంతో పేరొందాయి. చిత్రకారుడిగా కూడా ప్రతిభ చాటుకున్నారు. సినిమా రంగంలో సేవ లకు గాను 'దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు'ను కేంద్ర ప్రభుత్వం ఇస్తోంది. 1944 ఫిబ్రవరి 16న కన్నుమూశారు.

ఆనందమయి మాత (జయంతి)



ఆనందమయి మాతగా పేరొందిన నిర్మల సుందరి 1896 ఏప్రిల్ 30న జన్మించారు. భారతీయ సన్యాసియ యోగా గురువు. 1924లో భర్తతో కలసి షాబాగ్‌కు వెళ్లారు. అక్కడ అతను ఢాకా నవాబ్‌తోటలకు సంరక్షకులుగా నియమించబడ్డారు. ఈ కాలంలో నిర్మల కీర్తనలలో పారవశ్యంలో ఉండేది. భాయిజీ అని పిలువబడే జ్యోతిశ్చంద్ర రే సన్నిహిత శిష్యుడు నిర్మలను 'ఆనందం వెల్లివిరిసిన తల్లి'గా పిలవాలని సూచించారు. 1926లో సిద్ధేశ్వరి ప్రాంతంలో గతంలో పాడుబడిన పురాతన కాళీ ఆలయాన్ని ఆమె పునరుద్ధరించారు. 1982 ఆగస్టు 27న డెహ్రాడూన్‌లో మరణించారు.

శ్రీశ్రీ (జయంతి)



శ్రీశ్రీగా పేరొందిన శ్రీరంగం శ్రీని వాసరావు 1910 ఏప్రిల్ 30న జన్మించారు. ఇరవయ్యో శతాబ్దపు తెలుగు సాహిత్యాన్ని శాసించిన మహాకవిగా పేరొందారు. సాంప్రదాయ, చందోబద్ధ కవిత్వాన్ని ధిక్కరించినవాడిగా, విప్లవకవిగా, అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడిగా, విప్లవ రచయితల సంఘం స్థాపక అధ్యక్షుడిగా, సినిమా పాటల రచయితగా రాణించారు. హేతువాది, నాస్తికుడు. ఏడో యేటనే రచనా వ్యాసంగాన్ని ప్రారంభించిన ఘనత ఆయనది. తన మొదటి గేయాల పుస్తకం ఎనిమిదో యేట ప్రచురింపబడింది. 'మహాప్రస్థానం' ఆయన రచనల్లో ప్రసిద్ధమైనది. అల్లూరి సీతా రామ రాజు సినిమాకు ఆయన రాసిన తెలుగువీర లేవరా... అనేది శ్రీశ్రీ రాసిన ఆణిముత్యాల్లో ఒకటి. ఎన్నో పురస్కారాలు అందుకున్నారు. 1983 జూన్ 15న కన్నుమూశారు.

సోనాల్ మాన్‌సింగ్ (పుట్టినరోజు)



పద్మవిభూషణ్ గ్రహీత సోనాల్ మాన్‌సింగ్ 1944 ఏప్రిల్ 30న ముంబైలో జన్మించారు. క్లాజికల్ డ్యాన్సర్, భరతనాట్యం, ఒడిస్సీ నృత్యాలలో గురువుగా పేరొందారు. కేళుచరన్ మోహపాత్ర వద్ద ఒడిస్సీలో ఆమె తర్ఫీదు పొందారు. న్యూ ఢిల్లీలో సెంటర్ ఫర్ ఇండియన్ క్లాజికల్ డ్యాన్సెస్ కేంద్రాన్ని స్థాపించారు. పద్మభూషణ్, పద్మ విభూషణ్, సంగీత నాటక అకాడమీ అవార్డు, కాళిదాస్ సమ్మాన్ తదితర గౌరవాలు అందుకున్నారు.

సుధా రఘునాథన్ (పుట్టినరోజు)



ప్రముఖ కర్ణాటక సంగీత గాయని 1956 ఏప్రిల్ 30న జన్మించారు. ఆర్థికశాస్త్రంలో పీజీ పట్టా పొందారు. తల్లి స్ఫూర్తితో సంగీతంపై అభిరుచితో ప్లే బ్యాక్ సింగర్‌గా రాణించడమే కర్ణాటక సంగీతంలో కాక దేశ విదేశాల్లో కచేరీలు ప్రదర్శించారు. పద్మశ్రీ, సంగీత కళానిధి, కళామణి, పద్మ విభూషణ్, సంగీత చూడామణి తదితర పురస్కారాలు అందుకున్నారు.

రోహిత్ శర్మ (పుట్టినరోజు)



రోహిత్ గురునాథ్ శర్మ 1987 ఏప్రిల్ 30న నాగ్‌పూర్‌లో జన్మించారు. ఇంటర్నేషనల్ క్రికెటర్‌గా రాణించి ప్రస్తుతం దేశ జాతీయ జట్టుకు కేప్టెన్‌గా ఉన్నారు. ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ తరఫున ఆడారు. వన్డేలలో అత్యధికంగా 264 పరుగులు చేశారు. కాగా వన్డే ఇంటర్నేషనల్స్‌లో మూడు డబుల్‌సెంచరీలు చేసిన ఘనత ఉంది. 2023 క్రికెట్ వరల్డ్‌కప్ వేళకు 556 సిక్స్‌లు, 50ఓవర్ల ఫార్మాట్‌లో 300 సిక్స్‌లు పూర్తి చేసిన తొలి ఇండియన్‌గా గుర్తింపు పొందారు. అర్జున అవార్డు, మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న తదితర అవార్డులు పొందారు. క్రికెటర్‌గానే కాక వన్యప్రాణుల సంరక్షణ విషయంలో పలు జాగృతి కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

పారిశ్రామికవాడ లేదంటే.. గ్రీన్‌జోన్‌గా పరిగణించాలి



రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భక్తరహళ్ళి ప్రతీశ్ తదితరులు

శిడ్లఘట్ట, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): పారిశ్రామికవాడను జంగమకోటి ప్రాంతంలో ఏర్పాటు చేయాలనీ లేదంటే గ్రీన్‌జోన్‌గా గుర్తించి రైతుల సాగు భూములను కాపాడాలని, తాలూకాలోని జంగమకోటి మినహా ఇతర ఏ ప్రాంతంలోనూ పారిశ్రామికవాడ ఏర్పాటు చేయరాదని కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం, హసిరుసేన డిమాండ్ చేసింది. అంబేడ్కర్ మెట్రిక్ పూర్వ బాలుర హాస్టల్ ఆవరణలో స్థానిక రైతులతో కలసి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భక్తరహళ్ళి ప్రతీశ్ మీడియాతో మాట్లాడారు. తాలూకా వ్యాప్తంగా రైతులు ఉన్నారని, ఎక్కడ పారిశ్రామికవాడ చేసినా రైతులు భూములు కోల్పోతారన్నారు. కావున ప్రభుత్వ సూచనల ప్రకారం జంగమకోటెలో పారిశ్రామిక వాడను ఏర్పాటు చేసి తాలూకా అభివృద్ధి చేసి నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలన్నారు. లేదా గ్రీన్‌జోన్‌గా గుర్తించి సాగుకు సహకారం అందించాలన్నారు. దళిత సంఘర్ష సమితి తాలూకా సంచాలకులు మళమాచనహళ్ళి రామాంజినప్ప మాట్లాడుతూ జంగమకోటెలో రియల్ ఎస్టేట్ రంగం పెరిగిందని, ఎక్కువగా వ్యవసాయ భూములే ఉన్నాయన్నారు. దీనివల్ల నిరుద్యోగులకు ఉపాధి, నియోజకవర్గానికి అభివృద్ధి లేదన్నారు. ఈ నేపథ్యంలో జంగమకోటెలోనే పారిశ్రామికవాడను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో యువ ప్రముఖులు భక్తరహళ్ళి విశ్వనాథ్, కేఏడీబీ రైతుపర పోరాట సమితి పదాధికారులు నడుపి నాయకనహళ్ళి సుబ్రమణి, వాసుదేవమూర్తి, యణ్ణంగూరు ప్రదీప్, గంగాధర్, 13 గ్రామాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధి కోసం సీఎంకు వినతి



ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ధీరజ్ మునిరాజ్

దొడ్డబళ్ళాపుర, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): దొడ్డబళ్ళాపుర నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసం గ్రాంట్లు మంజూరు చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు ఎమ్మెల్యే ధీరజ్ మునిరాజ్ వినతిపత్రం సమర్పించారు. గడిచిన రెండేళ్లలో చేపట్టిన కార్యక్రమాల గురించి విన్నవించినట్టు ఎమ్మెల్యే మీడియాకు తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 2024-25 బడ్జెట్‌లో దొడ్డబళ్ళాపురను శాటిలైట్ టౌన్‌గా మారుస్తామని ప్రకటించారన్నారు. 2025-26 బడ్జెట్‌లో అన్ని హంగులతో కూడిన జిల్లా క్రీడామైదానాన్ని మంజూరు చేశారన్నారు. జిల్లా ఆసుపత్రి, జిల్లా క్రీడామైదానం మంజూరైనా ఇంతవరకు ప్రభుత్వంనుంచి గ్రాంటు విడుదల కాలేదన్నారు. బడ్జెట్‌లో ప్రకటించినట్టుగా శాటిలైట్ టౌన్, ఇతర పథకాల అమలుకు తగిన నిధులు మంజూరు చేయాలని సీఎంను కోరానన్నారు. జిల్లా ఆసుపత్రికి శంకుస్థాపన జరిగిందని ఇంతవరకు పనులు ప్రారంభం కాలేదన్నారు. సాధనా సమావేశాలకు సిద్ధమైన ముఖ్యమంత్రిని జిల్లాను పర్యటించిన వేళ 2024 మార్చి 11న ఆరోగ్యశాఖతో రూ.167కోట్ల బెంగళూరు గ్రామీణ జిల్లా ఆసుపత్రికి శంకుస్థాపన చేశారన్నారు. ఈ పథకం ఇంతవరకు కార్యరూపం దాల్చలేదన్నారు. జాతీయరహదారికి అనుబంధంగా ఉండడంతో ప్రమాదాలకు గురైన వారికి చికిత్సలు అందించేందుకు ట్రామాకేర్ సెంటర్ ప్రారంభించాలని ప్రస్తావన చేసినట్టు తెలిపారు. వేగంగా విస్తరిస్తున్న దొడ్డబళ్ళాపురకు కావేరి నీరు అవసరమని, ప్రస్తుతం జక్కలమడుగు జలాశయం నుంచి కేవలం 33శాతం నీరు మాత్రమే లభిస్తుండడంతో 8 రోజులకోసారి నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. బెంగళూరు గ్రామీణ జిల్లాలోని నెలమంగల, హొసకోటె, దేవనహళ్ళి తాలూకాలకు కావేరి ఆరోదశలో తాగునీటి పథకం మంజూరైందని, అయితే దొడ్డబళ్ళాపురకు కూడా ఇందులో అవకాశం కల్పించాలని శాసనసభలో డిమాండ్ చేశానన్నారు. దొడ్డబళ్ళాపురకు మురుగునీటి శుద్ధీకరణ విభాగం (ఎస్‌టీపీ), అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) కల్పించేలా పథకం రూపొందించినా రెండేళ్లలో ఒక్కపైసా విడుదలకాలేదన్నారు. దొడ్డబళ్లాపురను జిల్లా కేంద్రంగా మార్చే అంశం గురించి కూడా వినతిలో ప్రస్తావించానన్నారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి లక్ష్యమన్నారు.

తెగిన బీఎస్ఎన్ఎల్ ఫైబర్ కేబుల్



మరమ్మతు చేస్తున్న సిబ్బంది

వినియోగదారుల అవస్థలు

విజయపుర, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణంలోని పురసభ కార్యాలయం వద్ద తాగునీటి పైప్‌లైన్ అమరికకోసం రోడ్డు తవ్వుతున్న వేళ బీఎస్ఎన్ఎల్ ఫైబర్ కేబుల్ కట్ అయ్యింది. దీంతో బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు ఇంటర్నెట్ లభించక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొన్ని బ్యాంకులలో సర్వర్‌డౌన్ సమస్యతో లావాదేవీలు జరగలేదు. మంగళవారం మధ్యాహ్నం 2 గంటల వరకు ఇదే పరిస్థితి నెలకొంది. రోడ్డు పనులవేళ బీఎస్ఎన్ఎల్ వారికి పురసభ సిబ్బంది ముందస్తు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. ఎక్కడెక్కడ కేబుల్ ఉంటుందనేది వారికి అవగాహన ఉంటుంది. పురసభ, బీఎస్ఎన్ఎల్ శాఖల మధ్య సమన్వయం కొరవడ్డంతో పరిస్థితి తలెత్తింది. చివరకు సమాచారం అందుకున్న బీఎస్ఎన్ఎల్ సిబ్బంది అక్కడికి చేరుకుని మరమ్మత్తు చర్యలు చేపట్టారు. ఇతర కంపెనీల మొబైల్ నెట్‌వర్క్ కంటే దశాబ్దాలపాటు సేవలందిస్తున్న బీఎస్ఎన్ఎల్ సంస్థ పట్ల నిర్లక్ష్యం చేయకుండా ప్రభుత్వం సైతం తగిన సహకారం అందించాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

అలరించిన డ్యాన్స్ డే

బెంగళూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ డ్యాన్స్ డేను పురస్కరించుకుని బసవనగుడిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వరల్డ్ కల్చర్ సెంటర్‌లో వివిధ నృత్యాలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. సోనాల్ పూజారి, శ్రేష్ఠ - భరతనాట్యం, మాన్య అండ్ గ్రూప్, ప్రిన్స్ అకాడమీలు జానపదం, శౌర్య - పాశ్చాత్యనృత్యం, వైదేహి అండ్ గ్రూప్-కథక్, రేఖా-కర్రసాము, తక్ష, చాణక్య, రెబంటో-గోందారి వైద్యం నృత్యాలు చేశారు. పెద్దసంఖ్యలో పాల్గొని నృత్య ప్రదర్శన వీక్షించారు.



నృత్యం చేస్తున్న కళాకారులు

జేసీ రోడ్డులో పనుల గోల

బెంగళూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): నిత్యం వేలాదివాహనాలు తిరిగే రద్దీ రోడ్డు అయిన జేసీ రోడ్డులో పైపుల అమరిక పనులు మందగతిన సాగుతున్నాయి. తరచూ ట్రాఫిక్‌జామ్ సమస్య నెలకొంటోంది. మరోవైపు దుమ్ము రేగుతుండడంతో ప్రయాణీకులు, వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైట్‌టాపింగ్‌లో భాగంగా పలురకాల పైపులు అమరుస్తున్నారు.



జేసీ రోడ్డులో కొనసాగుతున్న పైపుల ఏర్పాటు పనులు

ఆనేకల్‌లో ఉచిత ఆరోగ్య శిబిరం

దొమ్మసంద్ర, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఆనేకల్ పట్టణంలోని శ్రీరామకుటీరలో ఉచిత ఆరోగ్య పరీక్షా శిబిరం, ద్విచక్రవాహనాల మేళా నిర్వహించారు. డ్రైవ్ ఎక్స్ అండ్ వెంకటేశ్వర మోటార్స్ యజమాని నంజుండప్ప నేతృత్వంలో లయన్స్‌క్లబ్ రాగినాడు, నిసర్గ దేవా సంస్థ సహకారంతో శిబిరం ఏర్పాటైంది. వందలాదిమంది శిబిరంలో పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకోసమే శిబిరం ఐదు రోజులపాటు ఏర్పాటు చేశామని నిర్వాహకులు నంజుండప్ప తెలిపారు.



శిబిరంలో నంజుండప్ప తదితరులు

కేపీఎస్‌సీ అక్రమాలపై నిరసన



ఫ్రీడంపార్కులో ప్లకార్డులతో నిరసన ఇలా...

బెంగళూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): కర్ణాటక పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో అవినీతి గ్యారంటీ సాగుతోందని, కన్నడ మీడియం విద్యార్థులకు సామాజిక న్యాయం కల్పించాలని డిమాండ్ చేశారు. ఫ్రీడంపార్కులో అఖిల విద్యార్థి పరిశోధనా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన చేశారు. ఏఐడీఎస్‌ఓ ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడరాదన్నారు. విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు.

122 ఎంఎస్ఎంఈలకు యూనియన్ బ్యాంకు రుణాలు



ఎంఎస్ఎంఈ అవుట్‌రీచ్‌లో యూనియన్ బ్యాంకు అధికారులు

బెంగళూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ బ్యాంకులలో ఒకటైన యూనియన్‌బ్యాంక్ ఎంఎస్ఎంఈల ప్రోత్సాహానికి కట్టుబడి ఉందని జనరల్ మేనేజర్ జీకే సుధాకర్ అభిప్రాయపడ్డారు. సోమవారం ఎఫ్‌కేసీసీఐలో మెగా ఎంఎస్ఎంఈ అవుట్‌రీచ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం సుధాకర్ మాట్లాడుతూ చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధికి యూనియన్ బ్యాంక్ కట్టుబడి ఉందన్నారు. యూనియన్ బ్యాంక్‌లోని అన్ని శాఖల ద్వారా ఎంఎస్ఎంఈలకు రుణాలు, బ్యాంకు సేవలు సరళీకృతంగా అందిస్తున్నామన్నారు. మహిళా పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహిస్తున్నామన్నారు. మెగా ఎంఎస్ఎంఈలో 300మందికి పైగా లబ్ధిదారులు పాల్గొన్నారు. మెగా ఎంఎస్ఎంఈ అండ్ కాసా అవుట్‌రీచ్ శిబిరంలో 122మంది లబ్ధిదారులకు రూ.227.76 కోట్ల విలువైన రుణ మంజూరు పత్రాలను, 378 కోట్ల లీడ్స్‌కు అవకాశం ఇచ్చామన్నారు. ఎఫ్‌కేసీసీఐ చైర్మన్ ఎంజీ బాలకృష్ణ, సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ ఉమారెడ్డి, యూనియన్‌బ్యాంక్ జోనల్‌హెడ్ కల్యాణ్‌వర్మలు పాల్గొన్నారు. ఎంఎస్ఎంఈలో వారి అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

పెద్దపేగులో క్యాన్సర్‌ను ముందుగా గుర్తించాలి



మీడియా సమావేశంలో డాక్టర్ యశ్వంత్ తదితరులు

బెంగళూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): పెద్దపేగులో క్యాన్సర్‌ను ముందుగా గుర్తించాలని, తద్వారా చికిత్సలకు వెసలుబాటు ఉందని అపోలో క్యాన్సర్ సెంటర్ సర్జికల్ అంకాలజి సీనియర్ అడ్వైజర్ యశ్వంత్ ఆర్ అభిప్రాయపడ్డారు. ప్రత్యేకంగా కోల్‌ఫిట్ సెంటర్‌ను ప్రారంభించినట్టు తెలిపారు. మంగళవారం నగరంలో మీడియాతో మాట్లాడుతూ కోల్‌ఫిట్ సెంటర్ ద్వారా మలవిసర్జన ప్రదేశంలో పరీక్షలు జరిపి పెద్దపేగులో క్యాన్సర్‌ను గుర్తించవచ్చునన్నారు. ప్రస్తుతం క్యాన్సర్ వివిధ విధాలుగా వచ్చే అవకాశం ఉందన్నారు. వంశపారంపర్యం అనేది కాకుండా ఆహారపు అలవాట్లు, వ్యసనాలతోపాటు కాలుష్యం వంటి కారణాలు ఉన్నాయన్నారు. ముందుగా స్క్రీనింగ్ చేయించుకునేందుకు వీలుంగా ఉండాలనే కోల్‌ఫిట్‌ను ప్రారంభించామన్నారు. వయసు పైబడిన వారే కాకుండా 45ఏళ్లు దాటినవారు ఎవరైనా స్క్రీనింగ్ జరుపుకోవచ్చునన్నారు. భారీ వ్యయం కూడా ఉండదన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు దినేశ్ మాధవన్, నరసింహయ్య శ్రీనివాసయ్య, డాక్టర్ సచిన్‌శెట్టి తదితరులు పాల్గొన్నారు.

సంపాదిస్తూనే నేర్చుకోండి కోసం మేధావి స్కిల్స్ వివితో ఒప్పందం

బెంగళూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే పేరొందిన ఛాయ్ పాయింట్ నైపుణ్య ఆధారిత ఉన్నత శిక్షణలు కొనసాగిస్తున్న మేధావి స్కిల్స్ యూనివర్సిటీతో కీలక ఒప్పందం చేసుకుంది. సంపాదిస్తూనే నేర్చుకోండి అనే కార్యక్రమం ద్వారా నైపుణ్యత కల్పించడం, ఉద్యోగ అవకాశాలు కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నట్టు ప్రకటించారు. ఛాయ్ పాయింట్ వైస్ ప్రెసిడెంట్ సంజీవ్‌కుమార్, మేధావి స్కిల్స్ ఫౌండర్ చాన్స్‌లర్ ప్రవీణ్ దుడానిలు ఒప్పందం చేసుకున్నారు. ఛాయ్ పాయింట్ లోని అన్ని ప్రాంతాల్లోనూ ఫ్రంట్‌లైన్ బృందం యూజీసీ గుర్తింపు పొం దిన విద్యా కార్యక్రమాలను కొనసాగించడం, 10, 12 తరగతులు పూర్తి చేసినవారికి ఏడాదిపాటు సర్టిఫికెట్ కోర్సు, రెండేళ్ల డిప్లమో కోర్సులను, మూడేళ్ల బ్యాచిలర్ ఆఫ్ ఒకేషన్ ప్రోగ్రామ్‌లను కల్పించనున్నట్టు తెలి పారు. ప్రస్తుతం చాయ్‌పాయింట్ ద్వారా 900మంది ఫ్రంట్‌లైన్ బృందం సేవలందిస్తోందన్నారు. మేధావి చాన్స్‌లర్ ప్రవీణ్‌దుడాని మాట్లాడుతూ ఛాయ్‌పాయింట్‌తో ఒప్పందం ద్వారా వాస్తవ సమాజ అనుభవాన్ని తెలుసుకోదలిచామన్నారు. 2011లో ప్రారంభమైన ఛాయ్‌పాయింట్ 119 నగరాలలో కొనసాగుతోంది.

క్రెడాయ్ కర్ణాటక చైర్మన్‌గా భాస్కర్

బెంగళూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): క్రెడాయ్ కర్ణాటక సంస్థ అధ్యక్షులుగా భాస్కర్ టీ నాగేంద్రప్ప బాధ్యతలు చేపట్టారు. తాజా మాజీ చైర్మన్ ప్రదీప్ డీ రాయ్కర్ నుంచి బాధ్యతలను స్వీకరించారు. మంగళవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ యూటీ ఖాదర్, డీసీఎం డీకే శివకుమార్, మంత్రులు ఈశ్వర్‌ఖండ్రె, భైరతి సురేశ్, క్రెడాయ్ ప్రతినిధులతోపాటు పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ రెండేళ్ల పదవీకాలంలో రియల్‌ఎస్టేట్‌రంగంలో మార్పులు తీసుకొచ్చేందుకు పనిచేస్తానన్నారు. నామినేటెడ్ చైర్మన్‌గా ధర్మేంద్ర బీ మెహతా, ఉపాధ్యక్షులుగా ఉదయ్‌శంకర్‌శెట్టి, శ్రీహరి, కార్యదర్శిగా మహవీర్ ఎస్ మెహతా, జాయింట్ సెక్రటరీగా మమతా భరట్టి, పంచాక్షరి ఎస్ హిరేమఠ, అరుణ పండిత ఎల్, కోశాధికారిగా ధనరాజ్ తలంపల్లిలు బాధ్యతలు చేపట్టారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

పావగడ, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే వెంకటేశ్ పేర్కొన్నారు. మంగళవారం పావగడలోని గురుభవన్‌లో పేద మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురుషులతో సమానంగా మహిళలు రాణిస్తున్నారన్నారు. కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన రిజిస్ట్రేషన్ కోటా.. ఆవేదనలో జొన్న రైతులు



జొన్న కొనుగోలు కేంద్రం వద్ద క్యూలో వేచివున్న రైతులు

బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జొన్న రైతులు తమ కష్టాలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదు. కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ) క్రింద ఖరీఫ్‌లో సాగు చేసిన జొన్న కొనుగోలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా జొన్న నమోదు కేంద్రాలు ప్రారంభించింది. రాష్ట్ర వ్యాప్తంగా గత రెండు రోజులుగా సర్వర్ సాంకేతిక లోపం ఏర్పడడంతో నమోదు ప్రక్రియ స్థంభించింది. సోమవారం మధ్యాహ్నం సర్వేర్ సమస్య పరిష్కారమైంది. అయితే అప్పటికే రాష్ట్రానికి కేటాయించిన కోటా ముగియడంతో నమోదు ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో జిల్లా రైతులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. రాష్ట్ర వ్యాప్తంగా 10 లక్షల క్వింటాళ్ళ జొన్న ఖరీదు కోసం ప్రభుత్వం ప్రకటించింది. ఖరీదులో కూడా జిల్లాలకు రాష్ట్ర ప్రభుత్వం పరిమితి విధించింది. అయితే రైతులు దీనిని వ్యతిరేకిస్తూ పోరాటం చేసి ప్రభుత్వ స్థాయిలో చర్చించి పరిమితిని తొలగించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ 22న కొనుగోలుపై పరిమితి తొలగించింది. 24వ తేదీ గురువారం నుంచి బళ్ళారి, రాయచూరు, విజయనగర జిల్లాలతోపాటు రాష్ట్రంలో నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. 25 సాయంత్రమే సర్వర్‌లో సమస్య ఏర్పడడంతో నమోదు ప్రక్రియ స్థంభించింది. అప్పటి రాష్ట్ర వ్యాప్తంగా 9.40లక్షల క్వింటాళ్ళ కొనుగోలు నమోదు పూర్తికావడంతో కేవలం 60వేల క్వింటాళ్ళ ఖరీదుకు మాత్రమే అవకాశం ఉంది. దీంతో నమోదు ప్రక్రియ పూర్తి అవుతుందని తెలుసుకుని బళ్ళారి తాలూకా రైతులు శుక్రవారం రాత్రి నుంచే ఖరీదు కేంద్రాల వద్ద క్యూ కట్టారు. సోమవారం మధ్యాహ్నం 3గంటలకు సమయానికి సర్వర్ సమస్య నివారణ కావడంతో కేవలం నిముషాల్లో రాష్ట్ర వ్యాప్తంగా 60వేల క్వింటాళ్ళ నమోదు పూర్తి అయ్యింది. దీంతో బళ్లారిలో కేవలం కొంతమంది రైతులకు మాత్రమే అవకాశం దక్కింది. మిగలిన వందలాది మంది రైతులకు నిరాశే మిగిలింది. రైతులు సాగుచేసే ముందే ఎన్ని ఎకరాల్లో సాగు చేసే విషయం ప్రభుత్వానికి సమాచారం ఇచ్చామని, ప్రభుత్వం కొనుగోలుపై పరిమితి విధించడం సరికాదని రైతులు రాష్ట్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రైతులు పండించిన హైబ్రీడ్ జొన్నకు మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ 1500 నుంచి 1600 ధర పలుకుతోంది. ఎంఎస్‌పీ క్రింద రైతుకు క్వింటాల్‌కు రూ 3,371 లభిస్తోంది. ఎంఎస్‌పీ క్రింద నమోదు ముగియడంతో రైతులు భారీగా నష్టపోవాల్సి ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బళ్లారిలో ఖరీఫ్‌లో 60వేల క్వింటాళ్ళు, రాయచూరులో 3లక్షల క్వింటాళ్ళ వరకు నమోదు జరగాల్సి ఉందని అధికారులు అభిప్రాయ పడుతున్నారు. పరిస్థితి ఇలా ఉండగా..... నగరంలో 40డిగ్రీలకు పైబడి ఎండవేడమి ఉండడంతో ఏపీఎంసిలో నమోదు కోసం వచ్చిన రైతులకు అవసరమైన సౌకర్యాలు లేకపోవడంతో ఎండవేడిమి తాళలేక... క్యూ లైన్‌లో నిలబడలేక... చెప్పులను క్యూలో ఉంచిన దృశ్యాన్ని అందరూ ఆశ్చర్యంగా పరిశీలించారు



ఎండవేడిమి తాళలేక క్యూలో ఉంచిన చెప్పులు

ప్రభుత్వానికి తెలియజేస్తాం: డీసీ మిశ్రా

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న కనీస మద్దతు ధర కింద జొన్న కొనుగోలు విషయంలో కేంద్రం రాష్ట్రాలకు పరిమితులు విధించింది. పరిమితిని తొలగించే నిర్ణయం కేంద్రానికే కావడంతో సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తా.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1584.30	1,578.29
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	447	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	332	260
నీటి నిల్వ (టీఎంసీలు)	6.88	3.70

2న విద్యుత్ సరఫరాలో అంతరాయం

బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): బళ్లారి నగరంలోని జెస్కాం ఉప విభాగం -2 పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుంది. విద్యుత్ తీగలకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించే పనులు చేపడుతున్న కారణంగా 2వ తేదీన ఉదయం 8.30గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు నగరంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు జెస్కాం విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజనీయర్(వి) ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా ఫీడర్ ఎం 33 పరిధిలో వచ్చే కేహెచ్‌బీ. కాలనీ, నేతాజీ నగర్, ఇన్నారెడ్డి లేఔట్, ఇన్ఫ్యాంటరీ రోడ్డు, వాసవి పాఠశాల, కౌళగల్లు రోడ్డు, విద్యానగర్, కళ్యాణి కాలనీ, భత్రి రోడ్డు, భత్రి గురు కాలనీ, సత్యవాణి నగర్, సిద్దార్థ నగర్, వియాని కాలనీ, ఫీడర్ నెం 73 వ్యాప్తిలో బసవనకుంట, కోట ప్రాంతం, మొదటి, రెండవ గేట్ల పరిధి, సిద్ధార్థనగర్, సుధాక్రాస్, ఓపీడీ, ఫీడర్‌నెం 77 వ్యాప్తిలో ఓపీడీ, శాంతి నగర్, కౌళగల్లు రోడ్డు, బిమ్స్ క్యాంపస్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని అధికారులు కోరారు.

నగరంలో గుంతల పూడ్చివేత



క్లాక్ టవర్ వద్ద మరమ్మతు పనుల్లో సిబ్బంది

బళ్లారిరూరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): నగరంలోని రాయల్ సర్కిల్ వద్ద నూతన క్లాక్ టవర్ వద్ద వున్న గుంతలను మంగళవారం అధికారులు పూడ్చివేశారు. చాలా రోజులుగా ప్రధాన రహదారిపై ఉన్న గుంతలతో వాహనదారులు ఇబ్బంది పడేవారు. అయితే మరమ్మతులు చేపట్టి గోతులు పూడ్చడంపై నగరవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరికొన్ని రోజుల్లో టవర్ క్లాక్ ప్రారంభించనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

ప్రజాసమస్యలపై స్పందించాలి: తహసీల్దార్

సిరుగుప్ప, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలపై తక్షణం స్పందించాలని తహసీల్దార్ నరసప్ప అధికారులకు సూచించారు. మంగళవారం పట్టణంలో నూతన తహసీల్దార్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం రెవెన్యూ అధికారులు, విలేజ్ అకౌంటెంట్లు సమావేశం నిర్వహించారు. చట్టపరిధిలో పనులు చేస్తే ఎలాంటి సమస్య వుండదని, ప్రజాసమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. వేసవి కాలంలో పల్లెల్లో నీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్లు సిద్దార్థ, రాఘవేంద్ర, రెవెన్యూ అధికారులు మంజునాథ, హనుమంతప్ప, విలేజ్ అకౌంటెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పహల్గాం దోషులకు మరణశిక్ష విధించాలి

- మతం పేరుతో హత్యలు చేయడం క్షమించరాని నేరం
- ఏబీవీపీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

బళ్లారి సిటీ,ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గామ్‌లో హిందువులను కిరాతకంగా చంపేసిన దోషులకు మరణశిక్ష విధించాలని ఏబీవీపీ డిమాండ్ చేసింది. మంగళ వారం ఉగ్రదాడిని ఖండిస్తూ ఆల్ ఇండియాస్టూడెంట్స్ కౌన్సిల్ నేతృత్వంలో వందలాది మంది విద్యార్థులు హొస్పేట్‌లో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. హొసపేట నగరంలోని శ్రీ శంకర్ ఆనంద్ సింగ్ కళాశాల నుంచి నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉగ్రవాదులకు మద్దతు ఇస్తున్న పాకిస్తాన్‌ను ప్రపంచం బహిష్కరించాలన్నారు. ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ధనుష్ కుమార్ మాట్లాడుతూ హిందువులను పట్టుకుని కాల్చి చంపడం భరించలేనిదని, దీని ద్వారా ఉగ్రవాదులు దేశంలో శాంతికి భంగం కలిగించడానికి ప్రయత్నించారన్నారు. ఈ చర్యకు బాధ్యులైన ఉగ్రవాదులను వారికి ఏ దశలోనైన సహాయం చేసినవారిని గుర్తించి మరణశిక్ష విధించాలని డిమాండ్ చేశారు. భూమిపై స్వర్గదామం అయిన కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఈ దారుణమైన చర్యకు సంబందించిన వీడియోలు, ఫొటోలు అందరినీ ఆందోళనకు గురి చేస్తున్నాయని ఎస్ఎఫ్‌డీ రాష్ట్ర కో-కన్వీనర్ అభిషేక్ హిరేమఠ్ అన్నారు. కశ్మీరులో జరిగిన దాడి మతపరంగా పేరేపించబడిందన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దశాబ్దన్నర కాలంగా భారతదేశంలో ప్రజలు ఉగ్రవాద కార్యకలాపాలు, బాంబుపేలుళ్ల నుంచి విముక్తి పొంది ప్రశాంతంగా జీవితాన్ని గడుపున్నారు. పాకిస్తాన్ మద్దతుగల ఉగ్రవాదులు మరోసారి తమ తోకలను విప్పుతున్నారు. స్థానిక ముస్లీంలు భారత ఆహారం నీటిని తినడం ద్వారా పాకిస్తాన్ మద్దతు ఉన్న ఉగ్రవాదులకు మద్దతు ఇవ్వడం, సహకరించడం భారతదేశానికి చేసిన ద్రోహం వాళ్ళని కూడా కనుక్కొని శిక్షించాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠినచర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు భరత్,హనుమేశ్,ప్రవీణ్,యల్లలింగ, గణేశ్, నాగరాజ్, సరస్వతి, అన్నపూర్ణ, గాయత్రి, అంజలి సహావందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

ఎస్సీ వర్గీకరణపై సర్వే పకడ్బందీగా చేపట్టాలి

- ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించాలి: జడ్పీ సీఈఓ హ్యారిష్



మొక్కకు నీరు పోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జడ్పీ సీఈఓ

బళ్లారి గాంధీనగర్/సిటీ, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): న్యాయమూర్తి జస్టిస్ హెచ్ఎన్నాగమోహన్ దాస్ ఏకసభ్య విచారణ కమిషన్ సూచనల మేరకు ఎస్సీల వర్గీకరణపై సర్వే కార్యక్రమం సక్రమంగా చేపట్టాలని జడ్పీ సీఈఓ హ్యారీష్ సుమైర్ అధికారులకు సూచించారు. మే 5వ నుంచి 23వ తేదీ వరకు మూడు దశలుగా ఈ కార్యక్రమం చేపట్టాలని ఆయన అన్నారు. జిల్లా పంచాయతీ, సంఘీ సంక్షేమ శాఖ సంయుక్తంగా రాష్ట్ర స్థాయి శిక్షణ పొందిన జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్‌ల ద్వారా జిల్లాలో అన్ని శాసనసభ నియోజకవర్గాల్లో మాస్టర్ ట్రైనర్, సాంకేతిక అధికారులకు మంగళవారం జిల్లా పంచాయతీ సభాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గాలకు చెంది జాతుల కుటుంబాల సమగ్ర సర్వేను వైజ్ఞానికంగా చేపట్టాలని ప్రభుత్వం సూచించిందని, ఎలాంటి లోపాలు లేకుండా సర్వే చేపట్టాలన్నారు. మే 9 నుంచి 17 వరకు ఇంటింటికి వెళ్ళి సమీసర్వే చేపట్టి మొబైల్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. బ్లాక్ ఆధారంగా తలా 300 ఇళ్ళ కుటుంబాల వివరాలను సేకరించాలన్నారు. 19 నుంచి 21 వరకు మిగిలిపోయిన కుటుంబాల వివరాలను సేకరించాలన్నారు. సర్వే అధికారులు, సంబంధిత అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించా లన్నారు. రాష్ట్ర స్థాయిలో సర్వే జరుగుతుందని, జిల్లా స్థాయిలో జిల్లాధికారుల అధ్యక్షతన జిల్లా స్థాయి సమన్వయ సమితి ఉంటుందని, రాష్ట్రంలో గుర్తించిన 101 ఎస్సీ జాతుల గణన జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి మల్లికార్జున, రాష్ట్ర స్థాయిలో శిక్షన పొందిన జిల్లాస్థాయి మాస్టర్ ట్రైనర్స్ సయ్యద్ భాషా, మల్లికార్జున, కె.ఎ్ ఎ.శబరీష్ గుప్త, తాలూకాస్థాయి మాస్టర్ ట్రైనర్స్‌లు, సాంఘీక సంక్షేమ శాఖ అధికారులు, క్షేత్ర స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఉగ్రదాడి అమానుషం : సీపీఐ

రాయచూరు ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): జమ్ము-కశ్మీర్ పహల్గాం వద్ద యాత్రికుల పై ఉగ్రవాదులు జరిపిన దాడి అమానుషమని ఇలాంటి వారిని కఠినంగా శిక్షించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కేజీ వీరేశ్ అన్నారు. జరిగిన దాడి పట్ల యావత్ భారత దేశం నిరసన వ్యక్తం చేస్తున్న విసయాన్ని ప్రతిఒక్కరు అర్థం చేసుకోవాలన్నారు. దాడిని నిరసిస్తూ మంగళవారం నగరంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద సీపీఐ(ఎం) నాయకులు, కార్యకర్తలు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడిన కేజీ వీరేశ్, తన భద్రత వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు కేంద్ర ప్రభుత్వం మతపరమైన అంశాలను జోడిస్తు రాజకీయ వ్యాఖ్యలు చేస్తుండడం దురదృష్టకరమన్నారు. కుటుంబ సభ్యులను ఉగ్రవాదుల దాడిలో కోల్పోయారని, ఆ బాద ఎలా ఉంటుందో ఆయనకు స్వయంగా తెలుసన్నారు.

అధికారికి సన్మానం



గురురాజును సన్మానిస్తున్న సమాచార శాఖ అధికారులు

బళ్లారి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): జిల్లా సమాచార శాఖలో పనిచేస్తూ పదోన్నతి పొందిన గురురాజును మంగళవారం సమాచార శాఖ అధికారి సిబ్బంది ఘనంగా సన్మానించారు. గురురాజ జిల్లా సమాచార శాఖలో ఇన్ఫర్మేషన్ ఆఫీసర్‌గా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా సమాచార శాఖ అధికారి తుకారామ్ మాట్లాడుతూ.. గురురాజ తన ఉద్యోగ ధర్మంలో అంకితభావంతో పనిచేస్తున్నారని కొనియాడారు. అనంతరం ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, పాత్రికేయులు పాల్గొన్నారు.

ఆయుర్వేదంతో సంపూర్ణ ఆరోగ్యం

- సివిల్ కోర్టు న్యాయాధికారి అశోక్



మాట్లాడుతున్న న్యాయాధికారి అశోక్

సిరుగుప్ప, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఆయర్వేదం ఎంతో గొప్పదని, ఆయుర్వేద మందులతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని సివిల్ కోర్టు న్యాయాధికారి అశోక్ అన్నారు. సిరుగుప్ప కోర్టు ఆవరణంలో ఆరోగ్య సంక్షేమ శాఖ, న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆయుర్వేదం పురాతనమైనదని, దీంతో ఎలాంటి ప్రతికూలం లేకుండా ఆరోగ్యం పొందవచ్చన్నారు. ఈ సందర్భంగా ఆయుర్వేదిక్ వైద్యాధికారులు డాక్టర్ ఫణీంద్ర, న్యాయవాదుల సంఘం అధ్యక్షులు వెంకోబ, న్యాయవాదులు ప్రజలు పాల్గొన్నారు.



సీఆర్ఈడీఏఐ సమావేశంలో పాల్గొన్న రియల్ వ్యాపారులు

'బుడా'లో ఏడాదిగా స్తంభించిన ఫైళ్లు

- సీఆర్ఈడీఏఐ సమావేశంలో రియల్ వ్యాపారుల ఆవేదన
- సమస్యను పరిష్కరిస్తాం : డీసీఎం డీకేశీ హామీ

బళ్లారి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): బళ్లారి అర్బన్ డవెలప్‌మెంట్ అథారిటీ(బుడా) లో ఏడాది నుంచి ఏ పనులు కాకుండా స్తంభించిపోయాయని, లే-ఔట్లు అప్రూవల్ కాక అభివృద్ధి ఆగిపోయిందని రిలయ్ వ్యాపారులు డిసీఎం డికే శివ కుమార్ ముందు వాపోయారు. సోమవారం రాజధాని బెంగళూరులో కాఫిడ్రేషన్ ఆఫ్ రూరల్ ఎస్టేట్ డైవలప్‌మెంటర్స్ ఆసోషియేషన్ ఆఫ్ ఇండియా(సీఆర్ఈడీఏఐ) సమావేశం నిర్వహించారు. మంత్రి యూటీ ఖాదర్, డిప్యూటీ సీఎం డికే శివకుమార్, ఇతర అధికారులు, రియల్ వ్యాపారులు ఈ సమావేశానికి హజరయ్యారు. ఈ సందర్భంగా రియల్ వ్యాపారు పట్టణాల్లో వివిద అభివృద్ధి పనులు, లే-ఔట్లలో తీసుకోవాల్సిన, చేయాల్సిన ప్లానింగ్ వర్కర్ తదితర అంశాల పై చర్చించారు. 'బుడా'లో ఏడాది నుంచి ఏ ఫైళ్లు కదలడం లేదని, లే-ఔట్ల సంబంధించి సమావేశాలు నిర్వహించలేదని వ్యాపారులు పేర్కొన్నారు. గత సమావేశాల్లో చిసన తీర్మానాలనూ రద్దు చేశారని వాపోయారు. ఇలాగే కొనసాగితే అభివృద్ధి కుంటుపడుతుందని వాపోయారు. దీనిపై స్పందించిన డీసీఎం త్వరలో అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ సమావేశంలో రిలయ్ వ్యాపారులు శ్రీరాంరాజు, బుడా మాజీ అధ్యక్షుడు మారుతీ ప్రసాద్, మధురెడ్డి, జగన్నాథ్, ప్రశాంత్‌రెడ్డి, రాఘవ పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల జాగ్రత్త తప్పనిసరి

బళ్లారి సిటీ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం పట్ల ప్రతిఒక్కరూ జాగ్రత్త వహించాలని, ముఖ్యంగా యవ్వనంలో దూకుడు పనికి రాదని వైద్యురాలు భాగ్య సూచించారు. ప్లానింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా బళ్లారి బ్రాంచ్ బళ్లారి బిజినెస్ కాలేజ్ సహకారంతో బీబీసీ కళాశాల ఆడిటోరియంలో పిల్లల కోసం లైంగిక ఆరోగ్య విద్య ,హెచ్ఐవీ వైరస్ వ్యాప్తి సమాచార కార్యక్రమం మంగళవారం జరిగింది. కార్యక్రమాన్ని ఎఫ్‌పీఏఐ వైద్యురాలు భాగ్య ప్రారంభించి మాట్లాడారు. యవ్వనం ముఖ్యమైన దశ అని జాగ్రత్తగా మలుచుకుంటే ఉత్తమ భవిష్యత్తు సాధ్యమన్నారు. ఈ వయసులో శారీకంగా ,మానసికంగా అనేక మార్పులను గమనిస్తారన్నారు. మానసికంగా ధృడంగా ఉండి తప్పటడుగులు వేయకుండా చూడాలన్నారు. కార్యక్రమ చైర్మన్ అమరాజ్ బోపాల్ మాట్లాడుతూ లైంగిక ఆరోగ్య విద్యపై సమాచారాన్ని స్వీకరించడానికి సరైన జీవనశైలీ గురించి తెలుసుకోవడానికి ఈ కార్యక్రమం మంచి అవకాశాన్ని కల్పించిందన్నారు. కళాశాల పిల్లల కోసం ఇంత మంచి కార్యక్రమం నిర్వహిస్తుందున్నందుకు సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమ రిసోర్స్ పర్సన్, ఎఫ్‌పీఏఐ కార్యక్రమ నిర్వాహకురాలు విజయలక్ష్మి పూర్తి సమాచారాన్ని అందించారు. ప్రసంగ పోటీలో మొత్తం 25మంది విద్యార్థులు పాల్గొన్నారు. కీర్తన మొదటిస్థానం, స్వాతి రెండవస్థానం, ప్రిన్స్ మూడవస్థానం గెలుచుకున్నారు. ఈకార్యక్రమంలో బీబీసీ ప్రొఫెసర్లు శ్రీమతి శ్యామల, శ్రీమతి స్నేహ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ భాగ్య

రేపటిలోగా తొలగించాల్సిందే..!

- భారతి శిశు విద్యాలయానికి పురసభ ఆదేశం



సమావేశంలో పురసభ అధ్యక్షుడు బట్టా ప్రసాద్

కంప్లి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నడిబొడ్డున పురసభ స్థలంలో ఉన్న భారతి శిశు విద్యాలయం ఆంగ్ల మాధ్యమ పాఠశాలను మే ఒకటో లోగా ఆ స్థలాన్ని ఖాళీ చేయాలని లేకపోతే తామే జేసీబీ, హిటాచిల ద్వారా ఖాళీ చేయపడతామని పురసభ అధ్యక్షుడు బట్ట ప్రసాద్ ఆదేశించారు. రూ.కోట్లు విలువ చేసే సుమారు 30 సెంట్లకు పైగా వుండే స్థలంలో కొన్ని సంవత్సరాలుగా తమకు ఆ స్థలం నుంచి ఎటువంటి ఆదాయం లేకుండా వుండిపోయిందన్నారు. పాఠశాలలో పేద పిల్లలకైనా ఎలాంటి సదుపాయాలు, సహకారం అందలేదన్నారు. అనంతరం ఈ సమావేశంలో పాల్గొన్న పాఠశాల ప్రెసిడెంట్ కల్లుడి విశ్వనాథ్ మాట్లాడుతూ తమకు మరికొన్ని రోజులు గడువు ఇవ్వాలని కోరారు. అనంతరం కౌన్సిలర్ వీరాంజనేయులు, చాంద్‌బాషా మాట్లాడుతూ.. ఇప్పటివరకు ఇచ్చిన గడువులు చాలు మా స్థలం ఖాళీ చేసి మాకు ఇచ్చినట్లయితే ఎంతో మేలు చేసినవారవుతారన్నారు. నగర ఉత్పన్న కింద రూ.ఏడు కోట్లు నిధులు మంజూరయ్యాయని వాటితో పట్టణంలోని 23 వార్డుల్లో మౌళిక సదుపాయాలు కల్పించి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థాయి సమితి అధ్యక్షులు ఉస్మాన్, ముఖ్య అధికారి దుర్గన్న, కౌన్సిలర్లు బాబు, లడ్డూ వన్నూర్‌వలీ, రమేష్, రామాంజినేయులు, నామినేటెడ్ సభ్యులు డి మౌనేష్, కొట్రేష్, విరుపాక్షి, మేఘన పాల్గొన్నారు.

మరోచోటికి మార్చాల్సిందే..

భారతి శిశు విద్యాలయం ఆంగ్ల మాధ్యమ పాఠశాల జూన్ నెల ప్రారంభం కాకముందే మరోక చోటికి మార్చాలని దళిత సంఘం ప్రముఖులు రామన్న డిమాండ్ చేశారు. మంగళవారం కంప్లి అతిథి గృహంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే పాఠశాల శిథిలావస్థకు చేరుకుందని, రాబోయే కాలంలో ప్రమాదాలు జరిగే అవకాశం కూడా వుందన్నారు. సమావేశంలో సిద్దప్ప, మాయప్ప, దేవేంద్ర, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ అవార్డు ప్రదానం

బళ్లారిరూరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి) : సామాజిక సేవకు గుర్తింపుగా బళ్లారి పట్టణానికి చెందిన టీఎస్ సురేష్‌కుమార్‌కు అంబేడ్కర్ అవార్డు దక్కింది. మంగళవారం శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర పట్టణంలోని దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సత్కరించి అవార్డు అందజేశారు. దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతు, జేవీవీ రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్, ఏపీ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు దండు వీరయ్య, టిప్పుసుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షులు ఉమర్ ఫరూక్ మాట్లాడుతూ విద్యార్థులు, వృద్ధులు, దివ్యాంగులకు ప్రగతి శివ ట్రస్టు అందించిన సేవలకు అవార్డు అందజేశామన్నారు. కార్యక్రమంలో కవి జాబిల్లి చాంద్ బాషా, ఫొటోగ్రాఫర్ నీలకంఠ, రఘు, అంజి, ఛేంజ్ ఫర్ సొసైటీ అధ్యక్షులు జబీవుల్లా, భారతీరాజా పాల్గొన్నారు.



అవార్డు అందుకున్న టీఎస్ సురేష్ కుమార్

అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోండి

కంప్లి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో, పట్టణాల్లో యువతీ యువకులు అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకుని జీవితంలో ముందడుగు వేయాలని బౌద్ధ సమాజం జిల్లా అధ్యక్షుడు సుగ్గినల్లి రమేష్ తెలిపారు. మంగళవారం జిల్లా పరిధిలోని కుడితిని వద్ద స్నాతకోత్సవ విద్యుత్ కేంద్రంలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జయంతి, మాజీ ఉపప్రధాని జగ్జీవన్‌రామ్ 118వ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కేపీసీఎల్ ఈఈ ఉదయ నాయక్, సీఎస్ జ్యోతిలక్ష్మీ, బొమ్మనళ్లి అశోక్, శివలాల్‌జీ నాయక్, అశోక్ కుమార్, నాగవేణమ్మ, పశుపతి, ఎస్సీ, ఎస్టీ కార్యదర్శి వన్నూరుస్వామి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుగ్నళ్లి రమేష్

హోసూరు జోన్



రవాణా అధికారికి వినతిపత్రం అందజేస్తున్న కార్ల అసోసియేషన్ సభ్యులు

స్మార్ట్‌కార్డుల మంజూరులో జాప్యం తగదు

- ఆర్టీఓకు కార్ల యజమానుల సంఘం వినతి

హోసూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వాహనాల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి ఆర్‌సీ స్మార్ట్ కార్డులను వేగిరంగా మంజూరు చేయాలని కార్ల అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. హోసూరు-బాగలూరు రోడ్డులోని స్థానిక ఆర్టీఓ కార్యాలయంలో మంగళవారం అధికారులకు వినతిపత్రం సమర్పించారు. వాహనాల రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన స్మార్ట్‌కార్డుల మంజూరులో ఆరేడు నెలలపాటు జాప్యం జరుగుతోందని దీన్ని నివారించాలని విన్నవించారు. సాంకేతిక విధానం అమలులో ఉన్నా నెలల తరబడి జాప్యం చేయడం సరికాదన్నారు. అసోసియేషన్ జిల్లా నాయకుడు సునిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వీధికుక్కలను నియంత్రించండి

హోసూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): హోసూరు కార్పొరేషన్ పరిధిలో మాంసం దుకాణాలు కూడా అధికంగా ఉన్నాయి. వీటినుంచి వెలువడే వ్యర్థాలకోసం ఆయా చుట్టుపక్కల ప్రాంతాల్లో వీధికుక్కలు ఎక్కువగా తిరుగుతుంటాయి. అయితే రోడ్డుపై వెళ్లే పాదచారులను, ద్విచక్రవాహన చోదకులను ఇబ్బంది కలిగిస్తున్నాయి. రోడ్లపై ఇష్టం వచ్చినట్టు సంచరించడంతో వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఒక నెలరోజుల అవధిలో సుమారు పది వీధికుక్కలు మృత్యువాత చెందాయి. పలువురు గాయపడ్డారు. ఈ నేపథ్యంలో వీధికుక్కల నియంత్రణకు కార్పొరేషన్ కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



రహదారిపై వీధికుక్కల గుంపు

చంద్రచూడేశ్వరుడి హుండీ లెక్కింపు

హోసూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రముఖ ఆలయమైన అరుళ్మిగు చంద్రచూడేశ్వర ఆలయ హుండీ ఆదాయం రూ.24లక్షలుగా ఉంది. ఆలయ కార్యనిర్వాహక అధికారి సామిదురై నేతృత్వంలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు. అదియమ్మాన్ కళాశాల విద్యార్థులు హుండీ ఆదాయం లెక్కింపులో పాల్గొన్నారు. ఆలయంలో 8 శాశ్వత హుండీలు, 6 తాత్కాలిక హుండీలు ఉన్నాయి. అన్ని హుండీల ద్వారా రూ.23,91,737 నగదు, 18 గ్రాముల బంగారం, 115 గ్రాముల వెండి ఆదాయం వచ్చినట్టు అధికారులు ప్రకటించారు.



హుండీ లెక్కిస్తున్న విద్యార్థులు

కుడితినికి నీటి గండం..!

- చెరువు రక్షణ పట్టని అధికారులు
- పరివర్తన వేదిక ఆవేదన



ఆరడుగులకు చేరిన నీటి మట్టం, వేదిక అధ్యక్షుడు ఆనంద్‌కుమార్

కంప్లి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని కుడితినికి రానున్న కాలంలో నీటిగండం తప్పదని పరివర్తన వేదిక జిల్లా అధ్యక్షులు ఆనంద్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం కుడితినిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 35 వేలకు పైగా జనసంఖ్య వుండే పట్టణంలో నీటి సమస్య వల్ల ఎనిమిది రోజులకు ఒకసారి నీరు చెరువులో నుండి విడుదల చేయాల్సి వస్తోందన్నారు. బోర్లు ఎన్ని ఉన్న భూగర్భంలో జలాలు లేక ఇంకిపోయాయన్నారు. అధికారులు జాగ్రత్తలు వహించకపోతే కుడితిని పట్టణానికి నీటిగండం తప్పదన్నారు. మే 7న జరగనున్న దొడ్డ ఆంజనేయస్వామి రథోత్సవానికి నీటి ఇబ్బందులులేకుండా చూడాలన్నారు. కర్మాగారాల నుంచి నీరు తరలించడానికి ఏర్పాట్లు చేపట్టాలన్నారు. చెరువులో నీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. చెరువు చుట్టూ కంచె ఏర్పాటు చేసి కాపాడాలన్నారు.